RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 122 | గురువారం, జూన్ 13, 2024 | పేజీలు : 4

## మల్లారెడ్డికి బిగ్ షాక్..

హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికి బిగ్ షాక్ తగిలింది. సుచిత్ర పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 82లో ఉన్న ల్యాండ్ 33 గుంటల స్థలం మల్లారెడ్డి కాదని రెవిన్యూ అధికారులు తేల్చారు. ఈ మేరకు బుధవారం హైకోర్టుకు రెవెన్యూ అధికారులు నివేదిక అందజేశారు. సైబరాబాద్ పోలీసులకు సర్వే రిపోర్ట్ ను పంపించారు. అయితే.. దశాబ్ద కాలంగా అది తన భూమి అపి మల్లారెడ్డి అంటున్నారు. సర్వే నెంబర్ 82లో ఉన్న ల్యాండ్ పై 15 బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వే చేపట్టిన రెవిన్యూ అధికారులు.. ఆ భూమిని మల్లారెడ్డి కబ్జా చేసినట్లు తేల్చారు.

### మెగా బ్రదర్స్ తో కలిసి ప్రజలకు

# మోడీ అభివాదం



**విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టిడిపి అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాని నరేంద్ర మోడీతోపాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకకు టిడిపి, జనసేన కార్యకర్తల, జనాలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరందరి సమక్షంలో ఎపి సిఎంగా చంద్రబాబు ప్రమాణం చేశారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణం చేశారు.**

**వీరితోపాటు కేబినెట్ మంత్రులందరూ ప్రమాణం చేసిన తర్వాత చిరంజీవి, పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోడీ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా చిరంజీవి, పవన్ చేతులు పట్టుకొని పైకెత్తిన మోడీ ప్రజలకు అభివాదం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ సంఘటన వేడుకకు హైలెట్ గా నిలిచింది.**

# టెట్ 2024 ఫలితాలను విడుదల చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్: టీజీ టెట్ 2024 ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. టీజీ టెట్–2024 పేపర్–1కు 57,725 మంది అర్హత సాధించగా... పేపర్–2కు 51,443 మంది అర్హత సాధించారు. పేపర్–1లో 67.13శాతం.. పేపర్–2లో 34.18శాతం అర్హత సాధించారు. టెట్–2024లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు వచ్చే టెట్ కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇక, టెట్–2024లో అర్హత సాధించిన వారికి ఒకసారి ఉచితంగా డిఎస్సికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది.

కాగా, గత మార్చి 15వ తేదీన టిజిటెట్ 2024 నోటిఫికేషన్ వెలువడగా.. పేపర్–1కు 99,958 మంది, పేపర్–2కు 1,86,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 20వ తేదీన ప్రారంభమైన టెట్ పరీక్షలు జూన్ 2వ తేదీతో ముగిశాయి. పేపర్–1కి 86.03 శాతం మంది, పేపర్–2కి 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు.




## నవశకం దిశగా నడిపిస్తాం: మోదీ

**విజయవాడ:అసెంబ్లీ ఎన్నికల్లో జయభేరి మోగించిన టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి బుధవారం లాంఛనంగా కొలువుదీరింది. ఇవాళ విజయవాడ వద్ద జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా%ో% పవన్ కల్యాణ్, నారా లోకేశ్ సహా 24 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ నూతన ప్రభుత్వానికి ఆశీస్సులు అందజేశారు. అనంతరం మోదీ సోషల్ మీడియాలో స్పందించారు. ఏపీలో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార వేడుకకు హాజరయ్యాను. ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబుకు, మంత్రులుగా ప్రమాణం చేసిన ఇతరులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఏపీకి ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు, మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు, టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉంది. యువత ఆశలను ఈ ప్రభుత్వం నెరవేర్చుతుంది.. అని ట్విట్టర్‌లో ప్రధాని మోదీ స్పష్టం చేశారు.**

## ఎపి సిఎం చంద్రబాబుకు ప్రధాని మోదీ హగ్

విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు ఏపీ ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్... చంద్రబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. నారా చంద్రబాబు నాయుడు అనే... అంటూ బాబు ప్రమాణం కొనసాగింది. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని, భయం కానీ, పక్షపాతం కానీ, రాగద్వేషాలు కానీ లేకుండా... రాజ్యాంగాన్ని, శాసనాలను అనుసరించి ప్రజలందరికి న్యాయం చేకూర్చుతానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ ప్రమాణం ఆచరించారు. అనంతరం, చంద్రబాబును ప్రధాని నరేంద్ర మోదీ హత్తుకుని అభినందించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు.



## రైతు రుణ మాఫీపై దృష్టి మళ్లించేందుకే విచారణలు: జగదీష్ రెడ్డి

హైదరాబాద్: రుణమాఫీపై దృష్టి మరల్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్ల అంశంపై మాట్లాడుతోందని విమర్శించారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆరు నెలలైనప్పటికీ హామీల అమలు మరచి గత ప్రభుత్వాలపై నిందలు వేస్తూ కాంగ్రెస్ పబ్బం గడుపుతోందని మండిపడ్డారు. సూర్యాపేటలో ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ కమిషన్ల ఏర్పాటు పేరుతో డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. విచారణ కమిషన్లు వాటి పని అవి చేసుకుంటాయని ప్రభుత్వం లీకులు ఎందుకు ఇస్తోందని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ముగిశాక హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారని కమిషన్ల విచారణ పేరుతో మీడియాకు లీకుల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు.

### బండి సంజయ్ సహా మోదీ కేబినెట్‌లోని 28 మంది మంత్రులపై...

# క్రిమినల్ కేసులు

న్యూఢిల్లీ: కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. 71 మంది ఎంపీలకు మంత్రులుగా అవకాశం లభించింది. అయితే, మోదీ 3.0 కేబినెట్ లోని 71 మంది మంత్రుల్లో 28 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు తాజాగా వెల్లడైంది. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కించుకున్న బీజేపీ ఎంపీ బండి సంజయ్ సహా మొత్తం 28 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ తెలిపింది. ఆయా ఎంపీలు తమ ఎన్నికల నామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్లను



అధ్యయనం చేసి ఈ విషయాన్ని వెల్లడించింది. 28 మందిలో 19 మందిపై హత్యాయత్నం, విద్వేష ప్రసంగం, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరాలు ఉన్నట్లు తెలిపింది. ముఖ్యంగా పోర్టులు, షిప్పింగ్, వాటర్ వేస్ శాఖల సహాయ మంత్రి శంతనూ ఠాకూర్, విద్య, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సుఖాంత మజుందార్‌పై హత్యాయత్నం కేసులు ఉన్నట్లు పేర్కొంది. అదేవిధంగా శంతనూ ఠాకూర్, మజుందార్, బండి సంజయ్, సురేష్ గోపీ సహా ఐదుగురు సహాయ మంత్రులపై మహిళలపై నేరాలకు పాల్పడిన కేసులు నమోదైనట్లు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ నివేదించింది.



## ఒడిషా సీఎంగా మోహన్ మాఝీ ప్రమాణ స్వీకారం

**భువనేశ్వర్:** ఒడిషాలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం కొలువుతీరింది. నూతన సీఎంగా మోహన్ మాఝీ బుధవారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. మాఝీ ప్రమాణ స్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా సహా పలువురు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, బీజేపీ అగ్రనేతలు హాజరయ్యారు. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలుగా కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరీదా ప్రమాణ స్వీకారం చేశారు. మాఝీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఒడిషా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ హాజరయ్యారు.



# ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు...

## పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అధినేత చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం నాయుడు వేదికపై ప్రధాని మోదీని కౌగిలించుకున్నారు. నాయుడు ఆంధ్రా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి కాగా, 2014లో జరిగిన విభజన తర్వాత రెండోసారి. ఆంధ్రా విభజనకు ముందు 1995లో తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన నాయుడు 2004 వరకు వరుసగా తొమ్మిది సంవత్సరాలు రాష్ట్రాన్ని నడిపించారు. 2014లో విభజించబడిన ఆంధ్రాకు తిరిగి ముఖ్యమంత్రిగా టీడీపీ అధిష్టానం తిరిగి వచ్చి 2019 వరకు ఆంధ్రా గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రమాణ స్వీకారానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయుడు తనయుడు, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, నటులు చిరంజీవి, రజనీకాంత్, నందమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. టీడీపీ–బీజేపీ–జనసేన జాతీయ ప్రజాస్వామ్య కూటమికి నాయుడు నాయకత్వం వహించి అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికల్లో అఖండ విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో 175 మంది సభ్యుల అసెంబ్లీలో 135 మంది ఎమ్మెల్యేలతో టీడీపీ మెజారిటీని కలిగి ఉండగా, దాని మిత్రపక్షమైన జనసేన పార్టీకి 21, బీజేపీకి 8 మంది ఉన్నారు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి 11 మంది శాసనసభ్యులు ఉన్నారు. టీడీపీ విడుదల చేసిన జాబితా ప్రకారం కేబినెట్‌లో టీడీపీకి చెందిన 21 మంది, జనసేన పార్టీకి చెందిన ముగ్గురు, బీజేపీకి చెందిన ఒక ఎమ్మెల్యేలు ఉంటారు.

ప్రమాణస్వీకారం చేయనున్న టీడీపీ ఎమ్మెల్యేల్లో నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామా నాయుడు, ఎన్ఎండి ఫరూఖ్, ఆనం రామన్ నారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్ర, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, అనగాని సత్య ప్రసాద్, కొలుసు పార్థసారథి, కోల బాలయ్య స్వరం రవి, గుమ్మడి సంధ్యారాణి, బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎస్ సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి. జనసేన పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కొణిదెల పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనుండగా, బీజేపీ నుంచి సత్యకుమార్ యాదవ్ ఒక్కరే నాయుడు మంత్రివర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.



## సంపాదకీయం

# సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్..!

నేటి ఆధునిక వేగవంతమైన యాంత్రిక డిజిటల్ తెరల జీవితాల్లో గుండె జబ్బులు, వెన్నునొప్పులు, టైప్-2 మధుమేహం, కాన్సర్, ఉబ్బసం, కీళ్ళ నొప్పులు, అకాల మరణాలు, ఎముకల బలహీనతలు, కండరాలు బలహీన పడడం, గుండె/ఊపిరితిత్తులు బలహీన పడడం, కణజాల వ్యవస్థలు అవస్థ పడడం, స్థూలకాయ సంబంధ రుగ్మతలు, ఇతర దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు లాంటివి సర్వసాధారణం అయ్యాయి. అందువల్లనే 'సిట్టింగ్ ఈజ్ కిల్లింగ్ (అల్ప చలనశీలత లేదా నిశ్చల స్థితి ప్రాణాంతకం)' అనే నినాదం తరుచుగా, తీవ్ర స్వరంతో వినిపిస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా 25 శాతం జనాభా రోజుకు 8 లేదా అంత కన్న ఎక్కువ గంటలు సీట్లకు అతుక్కుపోతున్నారని తెలుస్తున్నది. శారీరక వ్యాయామం కొరవడడంతో ఏటా 6 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, 3.2 మిలియన్ అభాగ్యులు మరణిస్తున్నారని తెలుస్తున్నది. నిత్య జీవనశైలిలో శారీరక కదలికలు లేదా వ్యాయామాలపైన తగ్గడంతో అల్ప చలన వ్యాధులు లేదా హైపోకైనెటిక్ డిసీజెస్ మానవాళిని ఉప్పెనలా ముంచనున్నాయని తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. 'హైపో' అనగా 'అల్ప' అని, 'కైనెటిక్' అనగా 'చలనం' అని అర్థం చేసుకోవాలి. మన వయస్సు, అనువంశికత, లింగం లాంటివి మన చేతుల్లో ఉండవు, వాటిని మనం ప్రభావితం చేయలేం. ఇలాంటి చలనశీల రహిత జీవన విధానంలో ప్రతి ఒక్కరు కొన్ని మార్పులు చేసుకొన్న యెడల సంపూర్ణ ఆరోగ్య భాగ్యాలతో జీవితాలు సాఫీగా సాగుతాయని గమనించాలి. ప్రతి రోజు మన దైనందిన జీవితాల్లో కనీసం 30 - 60 నిమిషాల పాటు శారీక వ్యాయామానికి తప్పనిసరిగా కేటాయించాలి. మన వయసు, ఆసక్తులను బట్టి కాలి నడక, రన్నింగ్, మైదాన క్రీడలు, సైక్లింగ్, యోగా, ప్రాణాయామం, ధ్యానం, జిమ్ వ్యాయామాలు లాంటివి ఎంచుకొని తప్పనిసరిగా పాటించాలి. శారీరక శ్రమకు దూరమైతే హైపోకైనెటిక్ లేదా అల్ప చలనశీల వ్యాధులు/రుగ్మతలకు దగ్గరవుతామని తెలుసుకోవాలి. మనం నిత్యం తీసుకునే ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యానికి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయని గమనించాలి. అధిక సంతృప్త కొవ్వులు (సాచురేటెడ్ ఫాట్స్), అధిక లవణ వాడకం, అపరిమిత మాంసాహారం, కూరగాయలు/ఆకుకూరలను తక్కువగా తీసుకోవడం, చక్కర వాడకాన్ని తగ్గించడం లాంటి అసాధారణ ఆహారపు అలవాట్లు మన రుగ్మతలకు కారణం అవుతాయి. నిత్యం దినచర్యలో మార్పులు, పోషకాహారం తీసుకోవడంలో అశ్రద్ధ లాంటివి రోగాలకు దగ్గర చేస్తాయి. శారీరక చలనశీలత తగ్గి, అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని అపరిమితంగా తీసుకొన్న సందర్భాల్లో శరీర బరువు పెరగడం, ఒళ్ళు లావెక్కడం, శరీరంలో కొవ్వు పేరుకుపోవడం, స్థూలకాయ సమస్యలు ఉత్పన్నం కావడం మనకు తెలియకుండానే ప్రమాదకర రుగ్మతలు మనల్ని చుట్టి ప్రాణాంతకంగా మారతాయి. అన్ని తెలిసి మన ఆరోగ్య పరిరక్షణకు మనమే కంకణబద్ధులం కానియెడల మనం తొవ్వుకున్న గోతిలో మనమే పడాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలి. అధిక కొలెస్టరాల్, ట్రైగ్లిజరైడ్స్, అల్ప సాంద్రత కలిగిన లిపోప్రోటీన్లు, రక్తంలో గ్లూకోజ్, రక్త పోటు లాంటివి అనారోగ్య హేతువులుగా గుండె జబ్బులకు, మధుమేహ సమస్యలకు దారి తీస్తాయని మరిచిపోవద్దు. ఈ అంశాలన్నీ పరిమితిని దాటితే రక్తంలో కొవ్వులు పెరిగి తీవ్ర అనారోగ్యం బారిన పడాల్సి వస్తుంది. పొగ తాగే దురలవాటుతో ఐదు రెట్ల గుండె జబుల బారిన పడాల్సి వస్తున్నదని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తూ హెచ్చరికలు చేస్తున్నాయి. పొగాకు దురలవాటుతో అధిక బీపీ, కాన్సర్ లాంటి పలు ఇతర తీవ్ర జబ్బులు కలుగుతాయని తెలుసుకోవాలి. పొగాకు దురలవాటుకు దూరం అయితే హైపోకైనెటిక్ వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని తెలుస్తున్నది. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన వ్యక్తుల్లో హైపోకైనెటిక్ వ్యాధుల సమస్యలు పలు రెట్లు పెరుగుతాయి.తీవ్ర ఒత్తిడితో హృద్రోగ సమస్యలు, వెన్ను నొప్పులు దరి చేరతాయని మరువకుండా జాగరూకతతో ఉండాలి. నిత్యం శారీరక శ్రమ లేదా వ్యాయామం చేయని యెడల ఆరోగ్య సంక్షోభం ఏర్పడి వైద్య ఖర్చులు పెరగడం, పేదరిక ఊబిలోకి జారకపోవడం జరుగుతుందని గమనించాలి. దీర్ఘకాలం శారీరక శ్రమ లేదా వ్యాయామాలకు దూరం అయినప్పుడు మధుమేహం, బీపీ లాంటి రుగ్మతలు పెరుగుతూ 2వ, 3వ దశ అనారోగ్యాలు కలిగి గుండె జబ్బులపాలు కావడంతో హార్ట్ అటాక్/హార్ట్ స్ట్రోక్‌ల సంభావ్యత కూడా పెరుతుంది. మన జీవనశైలిలో శారీరక కదలికలకు చోటివ్వడం, పరిమిత పోషకాహారం తీసుకోవడం, మానసికంగా ప్రశాంత గొడుగున సమయాన్ని గడపడం, అనవసర హైరానాకు తావు ఇవ్వకుండా క్రమశిక్షణ కలిగిన ఆరోగ్యకర సమాజ స్థాపనకు మనం కూడా కారణం అవుదాం, ఆరోగ్య భారతాన్ని నిర్మించుకుందాం. హింసాత్మక సంఘటనలకు దూరంగా ఉండడం, ట్రాఫిక్ రద్దీలో అధిక సమయం గడపడం, కాలుష్యం, గ్రీన్ కవర్ తగ్గడం, మోటార్లు వాహన రవాణాకు మొగ్గు చూపడం, తీరిక సమయాల్లో డిజిటల్ తెరల విషవలయంలో దూరం, క్రీడా మైదానాలు/పార్కులు/వాకింగ్ ట్రాక్ సౌకర్యాలు లోపించడం లాంటి కారణాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

# ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## - మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం రోజున మేడ్చల్ మండలంలోని నూతనకల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ విచ్చేసి ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులకు పునః ప్రారంభ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జిల్లా లో మౌలిక వసతుల కల్పనకు 12 కోట్ల రూపాయలు మంజూరీ చేయడం జరిగిందన్నారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ ,యూనిఫామ్స్ లను విద్యార్థుల కు పంపిణీ చేశారు.తమ పిల్లలను ఉన్నత విద్య వైపు మళ్ళించి ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించాలని సూచించారు. గ్రామ పెద్దల సహకారంతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాలలను పూర్తిగా బలోపేతం చేయాలన్నారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం వలన ఉన్నత స్థాయిలో ఉన్నానని తెలియజేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, అందువలన తమ పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. మానసిక ఒత్తిడితో చదువు సంస్కారం రాదని ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా మంచి విద్యను అందిస్తారని తెలియజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పాఠశాలలో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన లక్ష్మీ ప్రసన్నకు సర్టిఫికెట్ అందజేశారు. ఆడపిల్లలు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, మగ పిల్లలు కూడా మంచి ఫలితాలు సాధించాలని కోరారు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చదివేందుకు గ్రామ పెద్దలు,పిల్లల తల్లిదండ్రుల సహకారం అందించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి మాట్లాడుతూ పునః ప్రారంభ పాఠశాలకు వచ్చిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని గత సంవత్సరం ఈ పాఠశాల నుండి 10 పాయింట్స్ వచ్చాయని అదే స్ఫూర్తితో ఇంకా చాలా మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నాను . ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమై విద్య అందిస్తున్నామని తెలిపారు. అవగాహన కలిగిన ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పాఠశాలలు తయారు చేయడం జరిగిందని ,తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ సాంబశివరావు, స్పెషల్ ఆఫీసర్ రేఖ మేరీ, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీడీవో వసంత లక్ష్మి, ఎమ్మార్వో శైలజ, ప్రధానోపాధ్యాయుడు కొండయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు శ్రీలత సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూ మండల్ సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

## - నర్మదా బయోకెమ్ లిమిటెడ్ డైరెక్టర్ హిమాలయ్ పటేల్






**శామీర్ పేట, (గరుడ వార్త) :** భూ మండల్ సేంద్రియ ఎరువులతో భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని నర్మదా బయోకెమ్ లిమిటెడ్ డైరెక్టర్ హిమాలయ్ పటేల్ అన్నారు. బుధవారం శామీర్ పేట మండల పరిధిలోని లియోనియాలో మునరా ఆగ్రో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సేంద్రియ ఎరువు అయిన భూమండల్ ను నూతనంగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హిమాలయ్ పటేల్ మాట్లాడుతూ భూమండల్ అనే సేంద్రియ ఎరువు ఉత్పత్తులను మార్కెట్ లోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ భూమండల్ వాడకం తో నేల సారవంతం పెరిగి పంటలు అధిక దిగుబడులు లభిస్తాయని చెప్పారు. మునారా ఆగ్రోటెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ సీఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ మునారా వారి ఎన్ టేక్, ఈ ప్రతేక ఎరువు భారతీయ రైతుల కోసం స్విట్జర్ ల్యాండ్ నుంచి దిగుమతి చేసుకోబడిందన్నారు. ఈ ఎరువులో నత్రజని, సల్ఫర్ కలిగి ఉంటుందని, ఎరువులో డీఎంపీపీ అనే సాంకేతిక ఉండడం వలన నేలలో నత్రజని 45 రోజుల నుంచి 75 రోజుల వరకు పంటకు అందిస్తుందని తెలిపారు. మునారా వారి గోల్డ్ బ్లాక్, ద్రవరూప సేంద్రియా ఎరువు పంటలపై పిచికారి చేసిన యెడల పంట యొక్క నాణ్యత పెరిగి దిగిబడి ఎక్కువ వస్తుందన్నారు. మునారా వారు సుస్థిర వ్యవసాయ అభివృద్ధికై రైతులకు నిరంతరంగా ఎరువులను అందజేయడమే కాకుండా తమ ఫార్మర్ సర్వీస్ సెంటర్ ద్వారా రైతులకు అత్యాధునిక సాంకేతిక పరికరాలతో పాటు తగు సూచనలు అందించడం జరుగుతుందని చెప్పారు. భారతదేశ నేలల్లో సేంద్రియ కర్బనం తక్కువగా ఉండటం వల్ల మట్టిలో సూక్ష్మ జీవులు తక్కువగా ఉంటాయని, ఫలితంగా మట్టి నాణ్యత కోల్పోతుందని తెలిపారు. మునారా వారు ఈ సమస్యను పరిష్కరించేందుకు రైతులకు భూమండల్ ను రైతులకు అందజేయనున్నామని ఈ ప్రత్యేక ఎరువు ఎకరానికి నాలుగు నుంచి ఐదు బస్తాలు వేసినట్లయితే మట్టిలో నీటి సాంద్రత, సూక్ష్మ జీవులు పెరిగి పంట దిగిబడి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీలర్లు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిగా చంద్ర బాబు ప్రమాణం పట్ల సంబరాలు

## - గోషామాయిల్ నియోజవర్గంలో పండుగ వాతావరణం



**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి టిడిపి నాలుగోసారి ఘన విజయం గా ముఖ్యమంత్రిగా ప్రమాణం శ్రీకారం చేస్తున్న అభివృద్ధి నాయకుడు నారా చంద్రబాబునాయుడు మరియు మహాకూటమి బిజెపికి మరియు పవన్ కళ్యాణ్, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రజలందరి తరపున గోషామహల్ సీనియర్ నాయకులు రామ్ నారాయణ యాదవ్, ఊర్మిళా దేవి సింగ్, కేడీ దినేష్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాణా సంచా కాల్చి రంగులు చల్లుకొని స్వీట్లు పంచి పెట్టి సంబరాలు చేసారు.తెలుపుతూ ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం సైకిల్ ఫుల్ స్పీడ్ గా వైయస్సార్ సిపి పార్టీకి క్లీన్ స్విఫ్ చేసిన తెలుగుదేశం పార్టీ ప్రజలే, అదే విధంగా రాబోయే సమయంలో తెలంగాణలో కూడా తెలుగుదేశం జెండా తెలంగాణ అడ్డా అని నినాదంతో తెలంగాణ తెలుగుదేశం గోషామయిల్ నియోజకవర్గం లో ఎన్టీఆర్ రామకృష్ణ థియేటర్ ఎదురుంగా నాయకులు సంబరాలు చేశారు ఈ కార్యక్రమం లో గోషామహల్ సీనియర్ నాయకులు రామ్ నారాయణ యాదవ్, ఊర్మిళా దేవి సింగ్, కేడీ దినేష్, ు అనిల్, వాసు శ్రీనివాస్, ఘన్ శ్యామ్ భాటి, జె మహేష్ బాబు, జయరాజ్ యాదవ్, అజీజ్ ఖాన్, వినోద్ కుమార్, సోమశేఖర్ కుర్మా, ఆనంద్ ఆండెకర్, ఆనంద్ సింగ్, సంతోష్ సింగ్, అమర్నాథ్ సింగ్, నర్సింగ్ ప్రసాద్, రాజు ముదిరాజ్, సాంబశివ ముదిరాజ్, వెంకటేష్, సరస్వతి బాయ్, తులసి బాయ్, మహమ్మద్ రఫీక్, రాజు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**శామీర్ పేట, (గరుడ వార్త) :** తోటి స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి బాసటగా నిలిచిన పూర్వ విద్యార్థులు. శామీర్ పేట మండలం యాడారం గ్రామానికి చెందిన సత్యనారాయణ శామీర్ పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేశాడు. కాగా మే నెల 22న సత్యనారాయణ అనారోగ్యానికి గురై మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న క్లాస్ మెంట్లు స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలవాలనుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం రూ.50 వేలను ఆర్థిక సాయంగా అందజేసి స్నేహితుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి పాఠశాలలో కూడా విద్యార్థుల సంఖ్యను పెంచాలి: ఎంపీ డా.మల్లు రవి

**నాగర్ కర్నూల్:** మన ఊరు -మన బడి ప్రో. జయశంకర్ సార్ బడి బాట కార్యక్రమమును నేడు నాగర్ కర్నూల్ జిల్లా వంగూర్ మండలం లోని మన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం అయిన కొండారెడ్డి పల్లి గ్రామం జిల్లా పరిషత్ పాఠశాలలో మన నాగర్ కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న కలెక్టర్ ఉదయకుమార్ ఐఏఎస్ , జడ్పీటీసీ కేవిఎన్, గ్రామీణ అభివృద్ధి చైర్మన్ ఏనుముల కృష్ణ రెడ్డి, స్థానిక ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ డా.మల్లు రవి మాట్లాడుతూ ప్రతి పాఠశాల లో కూడా విద్యార్థుల సంఖ్యను పెంచాలి అన్నారు. బడి బాట కార్యక్రమం లో తప్పకుండా స్థానిక నేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఉదయం, సాయంత్రం పూట ప్రచారం చేపట్టి విజయవంతం చేయాలి అని కోరారు. విద్యార్థులకు స్కూల్ యూని?ఫమ్, పుస్తకాలు అందజేశారు. మెరుగైన టీచింగ్ శిక్షణ ఇవ్వండి దానికి కావాల్సిన నిధులు కావాలి అంటే మంజూరు చేస్తాం అని కలెక్టర్ గారిని కోరారు. ప్రతి తరగతి గది లో 40 మంది ఉండాలి అన్నారు.

# ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ కు లక్ష ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం

**- మానవత్వం చాటుకున్న ఎమ్మినూరు క్రీడాకారులు**



**ఎమ్మిగనూరు:** ఫుట్ బాల్ కోచ్ మాబుసాబ్ ఆరోగ్య పరిస్థితిపై చలించిపోయారు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన క్రీడాకారులు. గత నెల రోజులుగా న్యుమోనియాతో బాధపడుతున్న మాబుసాబ్ కు మెరుగైన వైద్యం అందించేందుకు ఎమ్మిగనూరు ఫుట్ బాల్ క్లబ్ అసోసియేషన్ (జఈం) సభ్యులు కలిసి వైద్యం ఖర్చుల కోసం రూ.లక్ష ఐదు వేల నగదును ఆర్థిక సహాయంగా అందించి మానవత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమున్నా బాధిత కుటుంబానికి వై.ఎఫ్.ఎ క్రీడా సభ్యులు అండగా ఉంటామని ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వై.ఎఫ్.సి క్రీడా సభ్యులు విక్రమ్, పెద్దఈరన్న, ప్రసాద్, వీరేష్, ముని, శ్రీనివాసరెడ్డి, నాగరాజు, హనీఫ్, కర్ణకార్ రెడ్డి, శ్రీరాములు, సిజి ఈరన్న, విజయ్, చాంద్, లతీఫ్, నరసింహారాజు లు పాల్గొన్నారు.

# నందికొట్కూరు పట్టణంలో రోడ్డు ప్రమాదం

**- ముగ్గురు వ్యక్తులకు గాయాలు**




**నందికొట్కూర్:** నందికొట్కూరు పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉదయం రోడ్డు ప్రమాదం చోటు బుధవారం చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు రాళ్ల లోడుతో కర్నూల్ కి వెళ్తున్న ట్రాక్టర్, కోళ్లు సరఫరా చేసే బొలెరో వాహనం కర్నూల్ నుండి నందికొట్కూరు కు వస్తున్న బొలెరో వాహనం టైరు పేలడంతో రెండు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా పడిన ట్రాక్టర్, బొలెరో వాహనాలను తొలగించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

# బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా ప్రియదర్శిని

**నందికొట్కూర్:** బాల బాలికలు ఏ విధమైన పనిలో ఉండరాదని బడిలో ఉండాలని, బాల బాలికలచే పనులు చేయించారాదని పని చేయించిన తల్లిదండ్రులు పనిలో పెట్టుకున్న యజమానులు చట్ట ప్రకారం శిక్షించ బడతారని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రియదర్శిని జూనియర్ సివిల్ జడ్జిలు దివ్య అన్నారు. బుధవారం నందికొట్కూర్ పట్టణం కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరాముడు ఆధ్వర్యంలో నందు బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.

బడి ఈడు పిల్లలు అందరూ పాఠశాలల్లో విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఏ ఒక్కరినైనా బాల కార్మికులను పనిలో గాని, ప్రమాద భరిత రంగాల్లో గానీ పెట్టుకుంటే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బాలలతో, బాలల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రతినిధులు రాష్ట్రంలో బాల కార్మికుల లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అంగన్వాడీ, సచివాలయం, కార్మికశాఖ, పోలీసుశాఖ, మున్సిపల్, పంచాయతీ, రెవెన్యూశాఖల భాగస్వామ్యంతో పూర్తిస్థాయిలో బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని సూచించారు, అదేవిధంగా పర్యావరణం పరిరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు వాయు కాలుష్యం నీటి కాలుష్యం వివిధ రకాల కాలుష్యం నివారణ పై పొల్యూషన్ అధికారులు అవగాహన కల్పించాలని వారికి సూచించారు ఈనెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రఘునాథరెడ్డి రహింతుల్లా వెంకటేశ్వర్లు కేశాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి జలగం సేవలు...





జలగం వెంగళరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్కు 6 వ ముఖ్యమంత్రి, నక్సలైట్లను ఉక్కుపాదంతో అణచి వేసిన ముఖ్యమంత్రిగా ఆయన దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిపదవులు నిర్వహించాడు. జలగం వెంగళరావు 1922, మే 4న శ్రీకాకుళం జిల్లా రాజాంలో జన్మించాడు. 20వ ఏట ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం వచ్చి స్థిరపడి, నైజాం వ్యతిరేక పోరాటాన్ని ఆ ప్రాంతం నుంచే ప్రారంభించిన వెంగళరావు.. జెడ్పీ చైర్మన్గా, రాష్ట్ర హోం మంత్రిగా, ముఖ్యమంత్రిగా, పీ సీ సీ అధ్యక్షునిగా, కేంద్ర మంత్రిగా విధులు నిర్వర్తించారు. తన 20 వ ఏట నిజాముకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో పాల్గొన్నాడు. తెలంగాణ ప్రాంతంలో అమలవుతున్న కౌలుదారీ చట్టాలను నిరసిస్తూ చేపట్టిన ఈ ప్రచారంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్ళాడు. 1952 లో శాసనసభకు స్వతంత్రుడిగా పోటీ చేసి ఓడిపోయాడు. 1952 నుండి 1962 వరకు ఆయన కాంగ్రెసు పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ఉన్నాడు. 1962లో కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం నుండి గెలిచి, 1978 వరకు మరో మూడు సార్లు సత్తుపల్లి నియోజకవర్గానికి శాసనసభలో ప్రాతినిధ్యం వహించాడు. 1967లో పంచాయితీరాజ్ ఛాంబరు చైర్మనుగా ఎన్నికయ్యాడు. కాసు బ్రహ్మానంద రెడ్డి మంత్రివర్గంలో 1969 నుండి 1971 వరకు హోంమంత్రిగా, పి.వి.నరసింహారావు మంత్రివర్గంలో 1972-73 లో పరిశ్రమల మంత్రిగా పనిచేసాడు. జై ఆంధ్ర ఉద్యమ ఫలితంగా రాష్ట్రంలో విధించిన రాష్ట్రపతి పాలన ఎత్తివేసిన తరువాత వెంగళరావు ముఖ్యమంత్రి పదవికి ఎంపికయ్యాడు. 10 డిసెంబర్ 1973 నుండి 6 మార్చి 1978 వరకు ఆంధ్రప్రదేశ్ 5వ ముఖ్యమంత్రిగా పనిచేశాడు.

# సుబ్రహ్మణ్య ఆరాధనకు ఉద్దిష్టమైనది స్కంద షష్ఠి



జ్యేష్ఠ మాసంలోని శుక్ల పక్ష షష్ఠి రోజున శివపార్వతి దేవిల ముద్దుల తనయుడు స్కందుడిని (కార్తికేయ) నియమ నిష్టలతో పూజిస్తారు. కొన్ని ప్రాంతాలలో ఈ తిథిని స్కంద షష్ఠిగా కూడా జరుపుకుంటారు. స్కంద షష్ఠి హిందువులు జరుపుకునే ఒక ముఖ్యమైన పర్వదినం. ఈ స్కంద షష్ఠినే సుబ్రహ్మణ్య షష్ఠిగా జరుపుకుంటారు. దీన్ని ముఖ్యంగా దక్షిణాది ప్రాంతాలలో ఎక్కువగా జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున హిందువులు ఉపవాసం ఉంటూ శివపార్వతుల రెండో కుమారుడు, వినాయకుడి తమ్ముడు అయిన స్కందుడిని పూజిస్తారు. అందుకే స్కందషష్ఠి అంటారు. శివుని కుమారుడైన సుబ్రహ్మణ్య స్వామి కి..షణ్ముఖుడు, స్కందుడు, కార్తికేయుడు, వేలాయుధుడు, శరవణ భవుడు, గాంగేయుడు, గుహుడు, సేనాపతి, స్వామినాధుడు, సుబ్రహ్మణ్యుడు, మురుగన్, అనే పేర్లు ఉన్నాయి. పూర్వం మూడులోకాలను భయ భ్రాంతులచే పీడిస్తున్న "తారకాసుర" అనే రాక్షస సంహారం కోసం దేవతలు బ్రహ్మదేవుని శరణు వేడారు. బ్రహ్మ ఈశ్వర తేజాంశ సంభవుని వల్లనే తారకుడికి మరణం ఉంటుందని అని తెలపగా శివుని దేవతలు ఒప్పించి, హిమవంతుని పుత్రిక అయిన పార్వతీదేవితో వివాహం జరిపించారు. ఒకనాడు పార్వతీ పరమేశ్వరులు ఏకాంత ప్రణయానందగా ఉన్న సమయంలో అగ్నిదేవుడు పావురం రూపంలో వారి ఏకాంత మందిరంలోకి వెళ్ళగా, గమనించిన పరమ శివుడు తన దివ్య తేజస్సును ఆ అగ్నిహోత్రునిలోకి ప్రవేశ పెడతాడు. దానిని భరించలేక ఆ దివ్య తేజమును గంగానదిలో విడచి పెడతాడు. ఆ తేజము నదిలో స్నానమాడుచున్న షట్కృత్తికల దేవతల గర్భాన ప్రవేశిస్తుంది. ఆ రుద్ర తేజమును వారు భరించలేక పొదలలో విసర్జిస్తారు. ఆరుముఖాల తేజస్సుతో ఒక దివ్యమైన బాలుడుగా ఉద్భవిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీ పరమేశ్వరులు రుద్రాంశ సంభూతునిగా ఆ షణ్ముఖుని అక్కున చేర్చుకుని కైలాసం తీసుకుని వెళతారు. ఆ బాలుడు గంగాగర్భంలో తేజో రూపంలో ఉన్నందుకు గాంగే యుడని, షట్ కృత్తికలు వానిని పెంచి పెద్దచేసిన కారణం వల్ల మరియు ఆరుముఖాలు కలవాడు అగుటవల్ల షణ్ముఖు డని, కార్తీకేయుడని, అతడు గౌరీశంకరుల పుత్రుడగుటచే కుమారస్వామి అని, సుబ్రహ్మణ్య స్వామి అని పేర్లతో పిలువ బడ్డాడు. కారణజన్ముడైన ఈ బాలున్ని పార్వతి పరమేశ్వరులు దేవతలు కోరిక మేరకు కుమార స్వామిగా చేసి, దేవతల సర్వసైన్యాధ్యక్షునిగా నియ మించి పరమేశ్వరుడు "శూలం" మొదలైన ఆయుధాలను ఇవ్వగా, ఆ జగన్మాత పార్వతి కుమారుని దీవించి "శక్తి" అను ఆయుధాలను ఇచ్చి సర్వ శక్తివంతుడిని చేయగా నెమలి వాహనారూఢుడై ఆరు ముఖాలు పన్నెండు చేతులతో ఉగ్రరూపం దాల్చి ఆరు చేతులతో ధనస్సులను మరో ఆరు చేతులతో బాణాలు ధరించి రాక్షస సేనను ఒకేసారి సంహరించాలని తలచి "సర్పరూపం" దాల్చి రాక్షసు లను, భీకర యుద్ధములో తారకాసురుని సంహరించి విజయుడైనాడు. స్వామి ఆరాధనవల్ల నేత్రరోగాలు, చర్మవ్యాధులు తగ్గుతాయని పెళ్లికాని వారికి వివాహం జరిగి సత్ సంతాన సౌభాగ్యం కలిగి ఆయురారోగ్య ఐశ్వర్యములతో వర్ధిల్లు తారని భక్తుల విశ్వాసం. అలా సంతానం కలిగిన వారు శ్రీ స్వామివారి సహస్ర నామాలలో ఇష్టమైన పేరును వారి బిడ్డలకు పెట్టుకుంటారు. సుబ్రహ్మణ్యానికి పాము పూజకు సంబంధం ఉంది. మూలాధారము నుండి సహస్రారము వఱకు వెన్నెముక (బ్రహ్మదండి) మధ్యనుండి సర్పాకారముగ వ్యాపించి యుండు కుండలినీ శక్తి అన బడు సుషుమ్నానాడియే సుబ్రహ్మణ్యేశ్వరుడు. అజ్ఞాన దశ యందు మనస్సు ప్రపంచా భిముఖమై యుండుటం చేసి వృత్తులన్నియు సుషుమ్నా మార్గమున అధోముఖ వ్యాప్తి కలిగి యుండునపుడు కుండలి నీ (సర్పము = సుబ్రహ్మణ్య ము) పుచ్ఛము సహస్రార మందును, శిరస్సు మూలాధార మందును గలిగి యుండును. సమాధినిష్ఠ, (జ్ఞానావస్థ) యందు పుచ్ఛము మూలాధార మందును, శిరస్సు సహస్రార మందును కలిగి యుండును. అపుడు సర్పాకారుడగు సుబ్రహ్మణ్యుడు తన పడగ సహస్రార కర్ణిక యందుండు శివునిపై యుండును. ఈ కారణము వలన శివుఁడు నాగాభరణుడు అయినాడు. శివున కాభరణమగుట చేత సర్పరూపియగు సుబ్రహ్మణ్యు నకు పూజ్యత కలిగింది. జాతకంలో కుజ దోషం, కాలసర్ప దోషంచే సకాలంలో వివాహం కానివారు వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామి కళ్యాణాలను షష్ఠినాడు చేయటం కనిపిస్తుంది. నాగ ప్రతిష్ట చేసిన వారికి సంతానం కలుగుతుం దనే నమ్మకం భక్తులలో ఉంది. తమిళ నాడు ప్రాంతాలలో ఈ రోజున కావడి మొక్కును తీర్చటం ఆనవాయితీగా కనిపిస్తుంది.

# విశ్వమానవుడు సినారె....



సి.నా.రె అనే మూడక్షరాలు తెలుగు, ఉర్దూ, సంస్కృతం మూడు భాషల సంగమం. సాహిత్య లోకం, సినీ లోకం, అధ్యాపక లోకం అనే మూడు లోకాల మిశ్రమం. డా. సి. నారాయణరెడ్డి అవిభక్త కరీంనగర్ జిల్లా, వేములవాడ మండలం, హనుమాజిపేట గ్రామంలో కర్షక కుటుంబంలో (గురుపూర్ణిమ)నాడు 29.7.1931 నాడు జన్మించారు. తల్లి బుచ్చమ్మ, తండ్రి మల్లారెడ్డి. నారాయణరెడ్డి ఇంటిపేరు సింగిరెడ్డి. దేవుని మొక్కు వల్ల కొడుకు పుట్టాడని, సత్య నారాయణరెడ్డి అని పేరు పెట్టుకున్నారు. అయితే సిరిసిల్ల మాధ్యమిక పాఠశాలలో కొడుకును చేర్పించే సమయాన 'సి.నారాయణరెడ్డి'- అని నమోదు చేయించడం చేత, అదే పేరు స్థిరపడింది. హనుమాజి పేటలో ఆనాడు ప్రభుత్వ పాఠశాల లేనందువల్ల, వ్యక్తిగతంగా ఒక ఉపాధ్యాయుడు నడిపిన వీధి బడిలో ఆయన చదువుకు శ్రీకారం చుట్టి, ప్రాథమిక పాఠశాల విద్యను పూర్తి చేశారు. తరువాత సిరిసిల్లలో ఉర్దూ మాధ్యమంలో తెలుగును ఒక ఐచ్ఛిక విషయంగా గ్రహించి, మాధ్యమిక స్థాయి విద్యను అభ్యసించారు. 1948లో కరీంనగర్ లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేశారు. సినారెలో సహజంగా సృజనాత్మకశక్తి, లయాత్మకత, చిన్ననాటి నుండే ఉన్నాయి. చిన్నప్పటినుండి మట్టిలో పుట్టిన జానపదగీతాలను ఆలపించే వారు. హరికథలు, బుర్రకథలంటే చెవి కోసుకునే వారు.

హరికథా కథనాన్ని ఆశువుగా, సంగీతాత్మకంగా అనుకరించే వారు. వేములవాడ వాస్తవ్యులు చౌటి నరసయ్య హరికథా గానం ఆయనకు ఛందస్సు పట్ల మక్కువ, అభిరుచి కలగడానికి ప్రేరకమైంది. ఆరేడు తరగతుల నుండే కవితలు వ్రాయడం మొదలు పెట్టారు. ఛందస్సంటే తెలియని దశ అది. ఏడవ తరగతిలో సీస పద్యమని తెలియని దశలో "ఒకనాడు ఒక నక్క ఒక అడవిలో పొట్ట కోసర మెటో పోవుచుండె' అనే పంక్తితో ప్రారంభించి పద్యం వ్రాస్తే- అది సీసపద్యమని తెలిసి ఛందస్సుకు సంబంధించిన కొన్ని మెలకువలను తెలిపారు దూపాటి వేంకట రమణాచార్యులు. తొమ్మిదవ తరగతి చదువుతున్నప్పుడు వ్రాసిన-"మారుటెన్నడో విషంపు గుండెలీ జగాన మారుటెన్నడో" అనేది సినారె తొలి గేయం. పదవ తరగతిలో ఉన్నప్పుడు -"వెన్నవంటి మనసున్నవానికి, అన్నమేమొ కరువాయె ఉన్నవాని కింతన్న వీడుదా మన్న గుండె లేదాయె" వంటి పాటలు రాశారు. కరీంనగర్ విద్యార్థి మహాసభలో "విజయంబు సాధించినావా - విద్యార్థి, నీ వీర భావాలు నింగి వ్యాపించగాబీ నీ వైరి చిత్తాల నేల కంపించగా" వంటి గేయాలు రచించి పాడారు. ఉన్నత పాఠశాల విద్యాభ్యాస కాలంలోనే, నైజాం రాష్ట్రానికి స్వాతంత్ర్యం రావాలని జరిపిన విద్యార్థుల సత్యాగ్రహంలో పాల్గొన్నారు. హైదరాబాదు ఛాదర్ఘాట్ కళాశాలలో ఉర్దూ మాధ్యమంలో ఇంటర్ మీడియట్ (1948- 49) ముగించారు. ఇంటర్ చదువుతున్న సమయంలో జువ్వాడి గౌతమరావు సంపాదకత్వంలో వెలువడే 'జనశక్తి' పత్రికలో ఆయన కవిత తొలిసారిగా ప్రచురితమైంది. ప్రహ్లాద చరిత్ర, సీతాపహరణం అనే పద్య నాటికలను వ్రాశారు.

'భలే శిష్యులు' వంటి సాంఘిక నాటికలను రచించారు, ప్రదర్శించి, నటులుగా తామూ పాత్రధారణ చేశారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఉర్దూ మాధ్యమం లోనే 'బి.ఏ.' (1952) చదివారు. బి.ఏ. ద్వితీయ సంవత్సరంలో ఉన్నప్పుడు, ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల సాహితీ సంచిక - 'శోభ'కు సంపాదకత్వం నిర్వహించారు. 1954లో ఎం.ఏ. పట్టా పొందారు. ఎం.ఏ. విద్యార్థిగా 'సినీ కవి' అనే నాటికను వ్రాసి, 'మకరంద మూర్తి' అనే పాత్రను ధరించి, దర్శకత్వం వహించి, ఉత్తమ బహుమతిని అందుకున్నారు. 'ఆచార్య కె. గోపాలకృష్ణారావు, ఆచార్య పల్లా దుర్గయ్య, ఆచార్య దివాకర్ల వేంకటావధాని తదితరులు ఆయన గురువులు. ఎం.ఏ. పూర్తి చేసి, 1954-55లో కొంతకాలం, సికింద్రాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరరుగా పనిచేసి, అదే కాలేజీలో 1955లో ఆంధ్రోపన్యాసకులుగా ఉద్యోగం ఆరంభించారు. 1958-59లో నిజాం కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేస్తునే 1957 నుండి 1962వరకు, దేవులపల్లి కృష్ణశాస్త్రి సూచనను అనుసరించి, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో - 'ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు' అనే విషయంపై పరిశోధన సాగించి, 1962లో పిహెచ్.డి. పట్టాను పొందారు. ఆయన 50వ జన్మ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అధికార భాషా సంఘాధ్యక్ష పదవిని అందించింది. ఆ జన్మదినోత్సవ సన్మాన సభలో నారాయణరెడ్డి -"ఎవరికి ఈ సన్మానం, ఎందుకు ఈ సన్మానం, చెట్టంతటి పేరొందిన చిగురుకు ఈ సన్మానం" అని ప్రారంభించి..."పేరేమో సింగిరెడ్డి నారాయణరెడ్డి కాని, కులం కీళ్ళు విరిచే నాకలానికీ సన్మానం" అంటూ ఒక గేయ కవిత చదవగాబీ సభంతా హర్ష ధ్వానాలతో మారుమ్రోగింది. అధికార భాషా సంఘం అధ్యక్షులుగా 4-9-1981 నుండి 7-8-1985 వరకు, సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులుగా, తర్వాత దేశంలో ప్రథమ సార్వత్రిక విశ్వ విద్యాలయమైన ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమితులై, 8.8.1985 నుండి 20.6.1989 వరకు, విధులను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్ష పదవిని 21.6.1989 నుండి 4.11.1992 వరకు నిర్వహించారు. విశ్వ విద్యాలయంలో ప్రథమ స్నాతకోత్సవం తెలుగులో నిర్వహింప బడిన సందర్భంలో, అప్పటి ఛాన్స్ లర్, ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు పాల్గొనగా, ఉప రాష్ట్రపతి డా. శంకర్ దయాళ్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. 7.7.1991నాడు జరిగిన రెండవ స్నాతకోత్సవంలో, నాటి ప్రధాని శ్రీ పి.వి. నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. 1990 మార్చి 10, 11, 12 తేదీలలో బెంగుళూరులో 'మూడవ అఖిల భారత తెలుగు మహాసభలు' నిర్వహింప బడ్డాయి. అంతేకాక, మారిషస్ లో 1990 డిసెంబర్ లో "మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు"నిర్వహించింది ఈ తెలుగు విశ్వవిద్యాలయమే. సినారె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో భాషా సాంస్కృతిక సలహాదారుగా, సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా, ఆ తరువాత 1997 జులై నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా పని చేశారు. ఆ సమయం లోనే భారత రాష్ట్రపతి రాజ్యసభ సభ్యునిగా నామనిర్దేశం చేయగా, 27.8.1997 నుండి 26.8.2003 వరకు కొనసాగారు. దక్షిణ భారతం నుండి రాజ్యసభ సభ్యులుగా నియమింప బడిన ప్రథమకవి ఆయనే కావడం విశేషం. నవ్వని పువ్వు" (1953) మొదలుకొని,- 'అలలెత్తే అడుగులు' (2013), నింగికెగిరే చెట్లు (2014) వరకు 18 ప్రక్రియలలో సుమారు 90 గ్రంథాలు రచించారు. మాకందా'లను అందించడంలో, వచన కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శించడంలో 'ప్ర'పంచ పదులను నిర్మించడంలో - తెలుగు గజళ్ళకు మానవీయ దృక్పథాన్ని అనుసంధించడంలో, ప్రతీకాత్మకంగా వచన కవితలో 'ఇతిహాస కావ్యాన్ని' -'విశ్వంభర'ను నిర్మించడంలో, 'మట్టీ - మనిషీ - ఆకాశం' వంటి వచన కవితా 'కావ్యేతి హాసాన్ని' సంవిధాన సంపన్నంగా సృజించడంలో, 'పాటలో ఏముంది నా మాటలో ఏముంది' వంటి స్వీయ చలన చిత్ర గీతికా వ్యాఖ్యా రచనలో, ఋతు వర్ణనలను జీవితానికి సమన్వయిస్తూ 'ఋతుచక్రం' వంటి కావ్య రచనలో, గేయ కావ్యాలకు పద్య కావ్య ప్రౌఢిని, ప్రామాణికతనూ సంతరించడంలో, శతశతాధిక నూతన పదబంధ కల్పనంలో మహాకవి సినారె ప్రయోగశీలం ప్రస్ఫుట మవుతుంది.

# కెనడాతో కలిసి పనిచేసేందుకు సిద్ధం....



న్యూఢిల్లీ : పరస్పర అవగాహన ప్రాతిపదికగా కెనడాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా వున్నామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోడీకి శుభాకాంక్షలు తెలియచేస్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయు అభినందనలు తెలియచేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనిపై మోడీ స్పందిస్తూ ట్రుడెయుకు ధన్యవాదాలు తెలిపారు. ఒకరి ఆందోళనలను మరొకరు అర్థం చేసుకుని గౌరవించే పద్ధతిలో పరస్పర అవగాహనతో కెనడాతో పనిచేయడానికి భారత్ ఎదురుచూస్తోందన్నారు. తనకు అభినందనలు తెలియచేసిన పలువురు ప్రపంచ నేతలకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయా దేశాలతో సుహృద్భావ సంబంధాలు నెరిపేందుకు తాము కట్టుబడి వున్నామని చెప్పారు. ఫిన్లాండ్ ప్రధాని ఓర్పోకు పంపిన సందేశానికి సమాధానం పంపుతూ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడానికి భారత్ ఎదురుచూస్తోందన్నారు. స్లొవేనియా, ఉగాండా నేతలకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. భారత్, ఆఫ్రికా దేశాల మధ్య సంబంధాలు మరింత పటిష్టపడాలని కాంక్షిస్తున్నట్లు తెలిపారు. భారత్, ఆఫ్రికా ప్రజల ఆకాంక్షలు ఒక్కటేనని, వారి లక్ష్యాలు కూడా ఒకటేనన్నారు.

## ఫ్రెంచ్ పార్లమెంటు రద్దు...!



**పారిస్ :** ఫ్రాన్స్ పార్లమెంట్‌ను రద్దు చేసి తిరిగి తాజాగా ఎన్నికలకు వెళ్తున్నట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ సోమవారం ప్రకటించారు. ఇయు పార్లమెంటు ఎన్నికల్లో మారిన్ లీపెన్స్‌కి చెందిన మితవాద నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) పార్టీ చేతిలో మాక్రాన్ పార్టీ ఓటమి పాలవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం వచ్చిన యురోపియన్ పార్లమెంట్ ఫలితాలు తమ ప్రభుత్వానికి చాలా నిరాశపరిచాయని, వాటిని ఎంత మాత్రమూ నిర్లక్ష్యం చేయకూడదని తాము భావిస్తున్నట్లు చెప్పారు. జాతినుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, జూన్ 30న దిగువ సభ ఎన్నికలు జరుగుతాయని, జులై 7న రెండో రౌండ్ ఓటింగ్ జరుగుతుందని తెలిపారు. వివరణ ఇవ్వడానికి ఇది చాలా కీలకమైన సమయమని ఆయన వ్యాఖ్యానించారు. మీ ఆందోళనలన్నింటినీ విన్నాను, వాటిని సమాధానం చెప్పకుండా వదిలిపెట్టబోనని చెప్పారు. సామరస్యతతో వ్యవహరించడాలంటే ఫ్రాన్స్‌కు స్పష్టమైన మెజారిటీ అవసరమని అన్నారు. మితవాదపార్టీలు మొత్తంగా అన్ని చోట్లా ముందంజలో వుంటున్నాయని, ఈ పరిస్థితి కారణంగానే తాను రాజీనామా చేయడం లేదన్నారు. మొదటి ఎగ్జిట్ పోల్స్ ప్రకారం లీ పెన్స్ నేషనల్ ర్యాలీ పార్టీ 32శాతం ఓట్లను గెలుచుకుంది. సోషలిస్టులు 14శాతంతో వున్నారు. లీపెన్స్ బలంగా ఎదుగుతుండడం వల్ల అధికారంపై మాక్రాన్ పట్టు బలహీనమవుతుందని భావిస్తున్నారు. దిగ్భ్రాంతి కలిగించే రీతిలో మాక్రాన్ ప్రకటన వెలువడిన వెంటనే లీపెన్ మాట్లాడుతూ, రాబోయే జాతీయ ఎన్నికల్లో ప్రజలు తమపై విశ్వాసముంచితే తాము అధికారం చేపట్టడానికి సిద్ధంగా వున్నామని చెప్పారు.

## భారత్ మాల్దీవులు కలిసి పని చేయాలి




భారత్, మాల్దీవులు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో కేంద్ర మంత్రి జైశంకర్ సోమవారం మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుతో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంలో జైశంకర్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొన్ని గంటల తర్వాత వీరిద్దరూ భేటీ కావడం గమనార్హం. ఈ మీటింగ్ అనంతరం జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'న్యూఢిల్లీలో మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జును కలుసుకోవడం సంతోషంగా ఉంది. ఇరు దేశాలు సన్నిహితంగా కలిసి పనిచేయడం కోసం ఎదురుచూస్తున్నాం' అని పేర్కొన్నారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలు ఇంకా వెల్లడి కానప్పటికీ.. ప్రస్తుతం రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలపైనే చర్చ జరిగినట్టు తెలుస్తోంది. కాగా, ముయిజ్జు మాల్దీవుల అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత వ్యతిరేక చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముయిజ్జు భారత్‌కు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముయిజ్జుతో భేటీ కన్నా ముందు జైశంకర్ బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, శ్రీలంక అధ్యక్షుడు విక్రమ సింఘే, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గేతో సహా ఇతర విదేశీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. భారత్–బంగ్లాదేశ్, భారత్–శ్రీలంక, ఇతర దేశాలతో భారత్ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంటుందని నొక్కి చెప్పారు. మోడీ ప్రమాణ స్వీకారానికి హాజరైన విదేశీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళితుల మద్దతు కోల్పోయిన బిజెపి...



**న్యూఢిల్లీ :** దశాబ్ద కాలం తర్వాత లోక్‌సభలో బిజెపి మెజారిటీ కోల్పోయింది. 240 స్థానాలు గెలుచుకొని సభలో అతి పెద్ద పార్టీగా అవతరించింది. భారీ మెజారిటీతో బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ ప్రతిపక్షాలు చేసిన ప్రచారాన్ని ఓటర్లు విశ్వసించారు. ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల వారు బిజెపిని పక్కన పెట్టి ఇండియా బ్లాక్‌కు ఓటేశారు. దేశంలో 156 లోక్‌సభ స్థానాల్లో ఎస్‌సిల ప్రభావం గణనీయంగా ఉంది. వీటిలో ఇండియా బ్లాక్‌కు 93, ఎన్‌డిఎకు 57, ఇతరులకు 6 స్థానాలు లభించాయి. ఎస్‌సిల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాలకు సంబంధించి 2019 ఎన్నికలతో పోలిస్తే ఇండియా బ్లాక్ 53 సీట్లను అదనంగా గెలుచుకోగా, ఎన్‌డిఎ 34 స్థానాలను కోల్పోయింది. ఇతర పార్టీలు కూడా 19 స్థానాలను చేజార్చుకున్నాయి. రాజ్యాంగాన్ని మారిస్తే తమ మనుగడే ప్రమాదంలో పడుతుందని, తమ ఉపాధి వనరులు దెబ్బతింటాయని ఎస్‌సిలు ఆందోళన చెందారు. తాము గతంలో బిజెపికే ఓటు వేశామని, ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి తమకు నష్టం కలిగిస్తుందని, అందుకే ఈసారి సమాజ్‌వాదీ పార్టీకి ఓటేశామని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొందరు బాహాటంగానే చెప్పారు.

## ద్వేషాన్ని నమ్మకంతో భర్తీ చేద్దాం.....



ప్రధాని మోడీకి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ శుభాకాంక్షలు తెలిపారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతల చేపట్టిన సందర్భంగా మోడీని అభినందిస్తూ సోషల్ మీడియాలో షెహబాజ్ పోస్టు పెట్టారు. ధన్యవాదాలు తెలుపుతూ ఆయన పోస్టుకు మోడీ రిప్లయ్ ఇచ్చారు. "ఎన్నికల్లో మీ పార్టీ విజయం మీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది" అని పేర్కొంటూ పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా మోడీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉన్న ద్వేషాన్ని నమ్మకంతో భర్తీ చేద్దామని పిలుపునిచ్చారు. దక్షిణాసియాలోని రెండు బిలియన్ల ప్రజల భవిష్యత్తును నిర్మించే అవకాశాన్ని తీసుకుందామంటూ ఎక్స్ లో పోస్టు చేశారు.కాగా, మోడీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఏడు పొరుగు దేశాలను ఆహ్వానించినప్పటికీ.. పాకిస్థాన్‌కు మాత్రం భారత్ ఆహ్వానం పంపలేదు. దీంతో దాయాది దేశం ఈ కార్యక్రమానికి దూరంగా ఉండిపోయింది. 2014లో మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి అప్పటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్ హాజరయ్యారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి ఘటనలో 40 మంది భారత జవాన్లు చనిపోయారు. అప్పట్నుంచి ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్తంభించిపోయాయి.

## ఎంఆర్ సి భవనం నుండి ఎంపిపి కార్యాలయాన్ని ఖాళీ చేయండి

- తహశీల్దార్ కు, ఎంపిడివో లకు విడిసి, ఎండిసి ల విజ్ఞప్తి
- విద్యా ప్రాంగణంలో రాజకీయ కార్యాలయం
- పిల్లలకు, మహిళలకు కలుగుతున్న ఇబ్బందులు
- అంగన్ వాడీ కేంద్రం ఎదుటే... రాజకీయాల అడ్డ
- మద్యం ప్రియులు, గంజాయి ప్రియులతో పొంచి ఉన్న

**జగిత్యాల:** జగిత్యాల జిల్లా లోని బుగ్గారం మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా ఎమ్మార్సీ భవనాన్ని కబ్జా చేసుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎంపిపి, ఎంపిడివో, ఎంపీవో కార్యాలయాన్ని తక్షణమే ఖాళీ చేయాలని బుగ్గారం మండల అభివృద్ధి కమిటి అధ్యక్షులు చుక్క గంగారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటి అధ్యక్షులు నక్క చంద్రమౌళి లు స్థానిక తహశీల్దార్ కు, ఎంపిడివో కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు స్వయంగా తహశీల్దార్ మాజీద్, ఎంపిడివో మాడిషెట్టి శ్రీనివాస్‌లను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేసి, వాస్తవ పరిస్థితులను వివరించారు. గతంలో అద్దె భవనంలో ఉన్న ఎంపిపి కార్యాలయాన్ని రాజకీయంగా ఎమ్మార్సీ భవనం పై కన్ను పడి కబ్జా చేసి అక్రమంగా ఆక్రమించుకున్నారని వారు ఆరోపించారు. ఉన్నతాధికారుల నుండి గానీ, ప్రభుత్వం ద్వారా గానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా కబ్జా చేసి ఎంఆర్ సి భవనంలో ఎంపిపి కార్యాలయాన్ని కొనసాగించడం ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులకు, నాయకులకు తగదన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంగన్ వాడీ కేంద్రానికి ఎదురుగా గల ఎమ్మార్సీ భవనంలో ఎంపిపి కార్యాలయం కొనసాగడం వలన రాజకీయ నాయకుల, కార్యకర్తల అడ్డాలు, ఇదే సాకుగా భావించి మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు కూడా అక్కడే అడ్డాలు వేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని వారు వివరించారు. వీటి వలన పాఠశాలలోని ఆడ పిల్లలకు, మహిళా టీచర్లకు, ఆంగన్ వాడీ టీచర్లకు, పిల్లల తల్లులకు, అంగన్ వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణీలకు, మహిళలకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని వారు పేర్కొన్నారు. మద్యం ప్రియులు, గంజాయి ప్రియులు, ఆకతాయిలు, ప్రవర్తన సరిగా లేని కొందరు రాజకీయ నాయకుల వలన అనుకోని సంఘటనలు జరిగే ప్రమాదం కూడా పొంచి ఉందని వారు తహశీల్దార్ మాజిద్, ఎంపిడివో శ్రీనివాస్ లతో ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల ప్రాంగణంలో గల ఎమ్మార్సీ భవనం నుండి ఎంపిపి కార్యాలయాన్ని ప్రైవేట్ అద్దె భవనంలోకి లేదా గత కొన్ని ఏండ్లుగా ఖాళీగా ఉన్న సిరివంచ కోట బాపతు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోకి లేదా, దాని ప్రక్కనే ఖాళీ ఉన్న అంగన్ వాడీ భవనం లోకి మార్చాలని వారు సూచించారు. గతంలో కూడా అధికారుల దృష్టికి, నాయకుల దృష్టికి తీసుకు వెళ్ళినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని వారు ఆరోపించారు.

## అమృత్‌పాల్ సింగ్ విడుదల కోసం రంగంలోకి కమలాహారిస్



ఖలిస్థానీ నాయకుడు అమృత్ పాల్ సింగ్ కోసం అమెరికా సిక్కు న్యాయవాది జస్ ప్రీత్ సింగ్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. అమృత్ పాల్ సింగ్ విడుదల కోసం అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తో భేటీ అయ్యారు. అమృత్ పాల్ సింగ్ ని జైలు నుంచి విడుదల చేసేందుకు సాయం చేయాలని కమలా హారిస్ ని కోరారు. గత రెండు– మూడు నెలల్లో కమలా హారిస్ ను రెండుసార్లు కలిశానని పేర్కొన్నారు. ఇంతేకాకుండా, భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వందమందికి పైగా అమెరికన్ కాంగ్రెస్ సభ్యులతో చర్చలు జరిపేందుకు రెడీ అయినట్లు తెలిపారు. అమృత్ పాల్ కేసును క్షుణ్ణంగా అధ్యయనం చేశానని.. అమృతపాల్ సింగ్ నిర్బంధం "అన్యాయం" అని జస్‌ప్రీత్ సింగ్ చెప్పారు. అమృత్ పాల్ సింగ్ ని పంజాబ్ పోలీసులు గతేడాది ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. ప్రస్తుతం జాతీయ భద్రతా చట్టం కింద అస్సాంలోని డిబ్రూగఢ్ జైల్లో ఉన్నారు. ఇకపోతే, పంజాబ్ లోని ఖదూర్ సాహిబ్ నియోజకవర్గం నుంచి అమృత్ పాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు.

అమృత్ పాల్ సింగ్ ని జైలు నుంచి విడుదల చేసేందుకు సాయం చేయాలని కమలా హారిస్ ని కోరారు. గత రెండు–మూడు నెలల్లో కమలా హారిస్ ను రెండుసార్లు కలిశానని పేర్కొన్నారు. ఇంతేకాకుండా, భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వందమందికి పైగా అమెరికన్ కాంగ్రెస్ సభ్యులతో చర్చలు జరిపేందుకు రెడీ అయినట్లు తెలిపారు.

## బాలల సంక్షేమమే సమాజ సంక్షేమం...!

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం, వివిధ దేశాలలో చట్టాలు ఎన్ని చేసినా అవి అమలుకు నోచుకోవడం లేదు. ఐక్యరాజ్య సమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంను ప్రారంభించింది. ప్రపంచంలో అసంఘటిత రంగంలో బాల కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ఉదాహరణకు ఇళ్లలో పనిచేసే బాలలు. వాస్తవానికి అనేక సందర్భాల్లో బాలకార్మిక వ్యవస్థ ప్రభుత్వ లెక్కల్లోకి రాదని కూడా జాతీయ బాలల హక్కుల కమిషన్ పేర్కొంటోంది. యునిసెఫ్ ప్రకారం దాదాపు సగంమందిబీ ప్రణాళికా సంఘం అంచనా ప్రకారం సుమారు 43 శాతం మంది బాలబాలికలు ఎనిమిదో తరగతిలోపే బడి మాని వేస్తున్నారు. షెడ్యూల్డ్ కులాల్లో ఇది 55% షెడ్యూల్డ్ తెగల్లో 63% దాకా ఉందని అంచనా. బడి మానేసిన ప్రతి పిల్లవాడూ అనివార్యంగా బాలకార్మికుడిగానే జీవిస్తున్నాడని వివిధ అధ్యయనాలు తెలియ జేస్తున్నాయి. ఫలితంగా బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు పెరుగు తున్నాయి. 2005 నాటికి జాతీయ బాలల కార్యాచరణలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిషేధంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలని లక్ష్యంగా పెట్టు కున్నారు. కానీ, ఈ లక్ష్య సాధనలో విఫలమయ్యాం. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం జరుపు కుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది. అందమైన బాల్యాన్ని లేకుండా చేయడం అతి పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన. బాలకార్మిక వ్యవస్థను రద్దు చేయాలన్నా లేదా బాల్య వివాహాలను పూర్తిగా నిషేధించాలన్నా ముందు జరగాల్సింది సార్వత్రిక ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవడం. అందుకే విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. చట్టం అమల్లో భాగంగా బడి బయట ఉన్న పిల్లలను, మధ్యలో మానేసిన వారిని తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది. విద్యా హక్కు చట్టం హామీ ఇచ్చినవిధంగా వీరందరికీ వాళ్ల వయసుకు తగిన తరగతిలో చేర్పించి విద్యనం దించడమూ ఒక సవాలే. మధ్యలో బడి మానేయకుండా చూడటానికి ఎనిమిదో తరగతి వరకూ పిల్లలకు డిటెన్షన్ పద్ధతి ఉండకూడదనిబీ వీరిని సమగ్ర, నిరంతర మూల్యాంకన పద్ధతి ద్వారా పరీక్షించాలని విద్యాహక్కు చట్టం చెబుతోంది. నాణ్యమైన విద్యనందించడం ద్వారా ప్రతి ఒక్కరూ అవసరమైన స్థాయిలో చదువు నేర్చుకుని, తర్వాతి తరగతిలోకి ప్రవేశించ గలిగేలా చేయాల్సిన బాధ్యత పాఠశాలపై ఉంటుందనీ చట్టం పేర్కొంటోంది. బాలలు బాల కార్మికులుగా మారకుండా చేసేందుకు విద్యాహక్కు చట్టంలో అనేక ఇతర నిబంధనలూ ఉన్నాయి. విద్యా సంవత్సరంలో ఏ సమయంలో వచ్చినా తగిన తరగతిలో చేర్చుకోవాలి. అవసరమైన అదనపు శిక్షణ ఇవ్వాలి. దండన లేని బోధన అందించాలి. బడిలో ఉండాల్సిన పిల్లలు అందులో చేరక పోవడానికి, మధ్యలో బడి మానేసి బయట ఉండటానికి తల్లిదండ్రుల పేదరికం, సామాజిక వెనక బాటుతనంబీ పిల్లలకు అనుకూలంగా లేని బోధనాంశాలు, బోధనా ప్రణాళిక తదితర కారణాలు ఉన్నాయి. భారత రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. వయసుకు తగని ఆర్థిక కార్యకలాపాలు, వృత్తుల్లో పని చేయకుండా భారత రాజ్యాంగం పిల్లలకు రక్షణ కల్పిస్తోంది. బాల కార్మిక వ్యవస్థను రూపుమాపడానికి భారత ప్రభుత్వం త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. మొదటిది: బాల కార్మిక చట్టాల అమలుబీ రెండోది: బాలల సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన, అమలుబీ మూడోది: బాల కార్మిక వ్యవస్థ అధికంగా ఉన్న ప్రదేశాలు, రంగాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా పథకాలను అమలు చేయడం. 1986లో చేసిన బాల కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం నోటిపై చేసిన ప్రమాదకర వృత్తుల్లో బాలకార్మికులుండటాన్ని నిషేధిస్తోంది. ప్రస్తుతం ఇలాంటి 18 ప్రమాదకర వృత్తులను, 65 ప్రమాదకర ప్రక్రియలను గుర్తించారు. రాజ్యాంగంలోని 24, 39, 45వ అధికరణలు పిల్లలకు శ్రమ దోపిడీ నుంచే కాకుండా ఇతర రక్షణలనూ కల్పిస్తున్నాయి. బాలలు ఆరోగ్యంగా జీవించే హక్కు వుంది, సామాజిక భద్రత పొందే హక్కువుంది. ఉచిత నిర్బంధ విద్యను పొందడం బాలల హక్కు. బాలలకు విశ్రాంతిగా వుండే హక్కువుంది. ఆటలు వినోద కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు వుంది. ప్రమాదకరమైన పనులు గనుల్లో, పేలుడు పదార్థాల తయారీలో, హెూటళ్ళలో బాలల్ని పని చేయించరాదు. మారక ద్రవ్యాల నుండి బాలలను దూరం చేయాలి. వారికి అందుబాటులో వుంచడం, వారి ద్వారా తెటప్పించు కోవడం నేరం.బాలల్ని నిర్బంధించరాదు. లైంగిక ధూషణ చేయరాదు. బాలల సంక్షేమానికై దోపిడి ఏ రూపంలో వున్నా ప్రభుత్వాలు నిషేధించాలి. 18 సంవత్సరాలలోపు వయస్సు బాలల్ని విడుదల చేయటానికి వీలులేని నేరాలకు ఉరి శిక్షగాని, యావజ్జీవ శిక్షగాని విధించరాదు. భారత దేశంలో పుట్టిన 12 మిలియన్ల బాలికల్లో 3 మిలియన్ల మంది తమ 15వ పుట్టిన రోజును, ఒకమిలియన్ మంది తమ మొదటి పుట్టిన రోజును జరుపు కోకుండానే మరణిస్తున్నారు. లింగ విచక్షణ వల్ల ప్రతి ఆరుగురిలో ఒక బాలిక చావుకి గురవుతుంది. 50% బాలబాలికలకు పోషకాహారం అందడం లేదు. బాలురలో 5 గురిలో ఒకరు, బాలికలలో ఇద్దరిలో ఒకరు పోషకాహారం పొందడం లేదు. ఇక 2 సం.ల వయస్సు లోపు శిశువులలో 58% మందికి పూర్తిగా వాక్సి నేషన్ అందడం లేదు. 24% పిల్లలకి ఎలాంటి వాక్సినేషన్ ఇవ్వలేదు. దేశంలో 60% పిల్లలు రక్తహీనతకు గురవుతున్నారు. దేశంలోని వ్యాపార లైంగిక వృత్తుల్లో 40% బాల బాలికలే. "ఇంటర్ నేషనల్ సెంటర్ ఆన్ లేబర్" నివేదిక ప్రకారం దేశంలో 25 మిలియన్లు నుంచి 30 మిలియన్ల వరకు బాల కార్మికులున్నారు. దేశంలో 50% బాలలు పాఠశాలలకే వెళ్ళడం లేదు.

# కుండలో నీళ్లు తాగుతున్నప్పుడు ఈ జాగ్రత్త తప్పనిసరి?



కుండలో ఉంచిన నీరు ఎంత కమ్మగా ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇవి చల్లగా ఉండటమే కాకుండా తాగడానికి కూడా ఎంతో రుచిగా ఉంటుంది, ఎందుకంటే నేలలోని తీపి పరిమళం కూడా చల్లదనాన్ని మనకు ఇస్తుంది. ఈ రోజు చాలా మంది ప్రజలు తమ ఇళ్లలో ఫ్రిజ్ కలిగి ఉన్నప్పటికీ, కుండ నుండి నీరు తాగుతున్నారు.కుండలోని నీటిని తాగడం వల్ల ఖచ్చితంగా చాలా ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి. అందుకే నేటికీ చాలా మంది ఇళ్లలో కుండలో నీటిని ఉంచుతున్నారు. అయితే, శుభ్రం చేసేటప్పుడు మాత్రం కొన్ని విషయాలను ఖచ్చితంగా గుర్తుంచుకోవడం ముఖ్యం. ఎందుకంటే కుండలో నీటిని ఎక్కువసేపు ఉంచడం వల్ల, నాచు తరచుగా పేరుకుపోతుంది, కాబట్టి దానిని క్రమం తప్పకుండా శుభ్రం చేయడం ఖచ్చితంగా చాలా అవసరం. కాబట్టి కుండను ఏ వస్తువులతో శుభ్రం చేయాలి? ఇంకా శుభ్రం చేసేందుకు సరైన పద్ధతి ఏమిటో ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం.ఇక కుండలో ఉంచిన చల్లటి నీరు చల్లదనాన్ని ఇవ్వడమే కాదు, ఖనిజాలు కూడా పుష్కలంగా ఉంటాయి. కుండ నీటిలోని ఆల్కలీన్ లక్షణాలు శరీరం %జూ౦% స్థాయిని నిర్వహించడంలో సహాయపడతాయి. ఇంకా యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యల నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. మీరు మొదటిసారిగా కొత్త కుండలో నీటిని నింపబోతున్నట్లయితే, దానిని కనీసం 12 గంటలు నీటిలో నానబెట్టి, ఆపై ఉప్పు వేసి, స్క్రబ్బర్‌తో పూర్తిగా శుభ్రం చేయండి. అప్పుడు సాధారణ నీటితో కడిగిన తర్వాత, నీటితో నింపి ఉంచండి.కుండను శుభ్రం చేయడానికి, ఒక చెంచా బేకింగ్ సోడా, 1 చెంచా వైట్ వెనిగర్ ఇంకా అలాగే ఒక చెంచా ఉప్పును కొంచెం నీటిలో కలపడం ద్వారా ఒక ద్రావణాన్ని తయారు చేయండి. ఇప్పుడు తయారుచేసిన ద్రావణాన్ని కుండలో పోసి బాగా తిప్పండి. ఇక ఆ తరువాత స్క్రబ్బర్‌తో శుభ్రం చేయండి. మీరు ఒక కుండలో నీటిని ఉంచినట్లయితే, ప్రతిరోజూ శుభ్రం చేయండి.

# టీ, కాఫీ మానేసి వీటిని తాగితే చాలా హెల్తీగా ఉంటారు...?

భారతదేశంలో చాలా మంది ప్రజలకు కూడా టీ తాగకపోతే తమ రోజు గడవదు. ఖచ్చితంగా వారు టీ, కాఫీ తాగాల్సిందే. కొందరికి అయితే టీ, కాఫీ తాగకపోతే వెంటనే తలనొప్పి భయంకరంగా మొదలవుతుంది. టీ లేదా కాఫీతో రోజును ప్రారంభించడం వల్ల మరింత శక్తివంతంగా ఉంటుందని కొంతమంది ఎంతగానో నమ్ముతారు.

అయితే టీ, కాఫీ తాగే అలవాటు ఆరోగ్యానికి అస్సలు ఏమాత్రం మంచిది కాదు. ఎందుకంటే ఈ అలవాటు అనేక విధాలుగా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. మన దినచర్యలో హెర్బల్ టీ తాగమని వైద్యులు సలహా ఇస్తుంటారు. హెర్బల్ టీలు చాలా ప్రయోజనకరంగా పరిగణించబడతాయి, టీ మరియు కాఫీలలో అదనపు కెఫిన్ ఉండటం వలన ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తుంది. అయితే వాటి బదులు హెర్బల్ టీ తాగడం వల్ల మీరు చాలా ప్రయోజనాలను పొందుతారు. మీ దినచర్యలో ఖచ్చితంగా పుదీనా టీని చేర్చుకోండి. ఎందుకంటే ఈ టీ తాగడం వల్ల ఉదయాన్నే మీరు రిఫ్రెష్‌గా ఉంటారు. ఇంకా దీనితో పాటు మీ ఇంద్రియాలు మెరుగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. ఇది మాత్రమే కాదు, మీకు తరచుగా తలనొప్పి లేదా జీర్ణ సమస్యలు ఉంటే, మీరు ప్రతిరోజూ ఉదయం తప్పనిసరిగా పుదీనా టీని త్రాగాలి. దాని ప్రయోజనాలను రెట్టింపు చేయడానికి, మీరు దీనికి నల్ల మిరియాలు మరియు తేనెను కూడా జోడించవచ్చు. మచ్చ టీ అనేది ఒక రకమైన గ్రీన్ టీ, ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది రోజంతా మీ శరీరాన్ని శక్తివంతంగా ఉంచుతుంది.




# కడుపుబ్బరాన్ని తరిమేసే చిట్కాలు...?



మనలో చాలా మందికి కూడా తిన్న వెంటనే కడుపు ఉబ్బరంగా అనిపిస్తుంది. వెంటనే గ్యాస్ అనేది చేరిపోతుంది. తక్కువ ఆహారం తీసుకున్నా చాలు కొందరికి ఈ సమస్య వస్తూనే ఉంటుంది.భోజనం చేయాలంటేనే చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది.అందువల్ల ఎంత ఆకలిగా ఉన్నా భోజనం సరిగ్గా చేయలేకపోతుంటారు. అయితే దీన్నే కొందరు గ్యాస్ అనుకుంటారు. కానీ గ్యాస్ట్రిక్ సమస్య వేరు, కడుపు ఉబ్బరం సమస్య వేరు. గ్యాస్ట్రిక్ సమస్య కనుక ఉంటే గ్యాస్ పదే పదే రిలీజ్ అవుతుంది. కానీ కడుపు ఉబ్బరం సమస్య వస్తే గ్యాస్ ఒక బయటకు పోదు. కడుపులో అలాగే ఉంటుంది. దీంతో చాలా రకాల ఇబ్బందులు పడతారు. అయితే మీలో ఎవరికైనా ఇలా తిన్న వెంటనే కడుపు ఉబ్బరం సమస్య కనుక వస్తుంటే అందుకు ఈ సహజసిద్ధమైన ఇంటి చిట్కాలను ట్రై చెయ్యండి.ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం టీ, కాఫీలకు బదులుగా యాపిల్ పండును లేదా ఒక గ్లాస్ యాపిల్ జ్యూస్ తాగాలి. అలాగే పరగడుపునే చిన్న అల్లం ముక్కను నమిలి తినవచ్చు. ఒక టీస్పూన్ అల్లం రసం సేవించినా చాలు. కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది.నానబెట్టిన బాదంపప్పులను నాలుగైదు తిన్నా కూడా కడుపు ఉబ్బరం తగ్గుతుంది. ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసం సేవించాలి. ఇది కడుపు ఉబ్బరాన్ని తగ్గించి జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది.ఇక కమోమిల్ టీని తాగుతున్నా కూడా కడుపు ఉబ్బరం తగ్గిపోతుంది. ఇది గ్యాస్ నుంచి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. రాత్రి పూట ఈ టీని సేవిస్తే మైండ్ రిలాక్స్ అవుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి, నిద్ర చక్కగా పడుతుంది, పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు.సోంపు గింజలతో తయారు చేసిన టీని తాగుతున్నా కూడా కడుపు ఉబ్బరం తగ్గుతుంది.

# చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే..?



నవజాత శిశువులని ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. వారికి ఆరోగ్యకరమైన ఎముకలు మరియు కండరాలను అభివృద్ధి అనేది చాలా అవసరం. కాబట్టి అలా చేయడానికి ఉత్తమ మార్గం పిల్లలకు రోజుకు 3 నుంచి 4 సార్లు మసాజ్ చేయడం.మసాజ్ రక్త ప్రసరణను బాగా మెరుగుపరుస్తుంది.ఇది కండరాల నడలింపు ఇంకా జాయింట్ ఫ్లెక్సిబిలిటీకి కూడా సహాయపడుతుంది. పైగా ఇది ఎముకల అభివృద్ధిపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపదు. శిశువు మసాజ్ తో ఓదార్పు అనుభూతిని పొందవచ్చు. ఇది మొత్తం శారీరక అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. కొబ్బరి నూనె అనేది తేమతో సమృద్ధిగా తేలికపాటి సువాసనను కలిగి ఉంటుంది.ఇది శిశువుకు మసాజ్ చేయడానికి చాలా రకాలుగా మంచిది.కొబ్బరి నూనెతో మసాజ్ అనేది సున్నితమైన చర్మానికి అనుకూలంగా ఉంటుంది. ఇంకా అలాగే, ఇది పొడిబారకుండా చేస్తుంది, డైపర్ దద్దుర్లను కూడా సహజంగా నయం చేస్తుంది. ఇంకా శిశువు చర్మంపై దద్దుర్లు రాకుండా చేస్తుంది. ఇంకా పిల్లలకు మసాజ్ చేయడానికి మస్టర్డ్ ఆయిల్ ఒక అద్భుతమైన ఎంపిక. ఇది వేడి ప్రభావానికి చాలా ప్రసిద్ధి చెందింది. ఇది పిల్లలను వెచ్చగా ఉంచడంలో బాగా సహాయపడుతుంది. ముఖ్యంగా చల్లని వాతావరణంలో చాలా మంచిది. ఇది ఎముకల ఆరోగ్యానికి ముఖ్యమైన కాల్షియం ఇంకా ఇతర ఖనిజాల యొక్క మంచి మూలం. ఇంకా అంతే కాకుండా ఆవాల నూనెలో యాంటీ ఫంగల్ గుణాలు కూడా ఉన్నాయి. పైగా ఇది వివిధ రకాల బ్యాక్టీరియా ఇంకా ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి శిశువును కాపాడుతుంది.బేబీ మసాజ్ అనేది మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి మరియు నిద్రను ప్రోత్సహిస్తుంది.ఈ మసాజ్ ద్వారా, పిల్లలు తమ ఇంద్రియాలను అన్వేషిస్తారు, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేస్తారు. ఇంకా అలాగే స్వీయ-నియంత్రణను నేర్చుకుంటారు. తల్లిదండ్రులు తమ బిడ్డ రిలాక్స్‌గా ఇంకా హాయిగా ఉండడం, కుటుంబంగా తమ బంధాన్ని మరింతగా పెంచుకోవడంలో ఎంతో ఆనందాన్ని పొందుతారు.బేబీ మసాజ్ అనేది ఎముకల బలాన్ని పెంపొందించడానికి, నిద్రను మెరుగుపరచడానికి ఇంకా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జర్నల్ ఆఫ్ స్లీప్ మెడిసిన్ లో ప్రచురితమైన ఒక పరిశోధన ప్రకారం మసాజ్ తర్వాత తల్లి ఇంకా బిడ్డ ఇద్దరూ నిద్రపోయే సమయం గణనీయంగా మెరుగుపడుతుంది. దీని వల్ల పిల్లవాడు చాలా సేపు హాయిగా ప్రశాంతంగా నిద్రపోతాడు.

కొబ్బరి నూనెతో మసాజ్ అనేది సున్నితమైన చర్మానికి అనుకూలంగా ఉంటుంది. ఇంకా అలాగే, ఇది పొడిబారకుండా చేస్తుంది, డైపర్ దద్దుర్లను కూడా సహజంగా నయం చేస్తుంది. ఇంకా శిశువు చర్మంపై దద్దుర్లు రాకుండా చేస్తుంది. ఇంకా పిల్లలకు మసాజ్ చేయడానికి మస్టర్డ్ ఆయిల్ ఒక అద్భుతమైన ఎంపిక. ఇది వేడి ప్రభావానికి చాలా ప్రసిద్ధి చెందింది. ఇది పిల్లలను వెచ్చగా ఉంచడంలో బాగా సహాయపడుతుంది. ముఖ్యంగా చల్లని వాతావరణంలో చాలా మంచిది.

# నూడుల్స్ ప్రియులకు షాకింగ్ న్యూస్..




ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్‌ల్లో అందుబాటులో ఉండే నూడుల్స్ చిన్నా పెద్ద ప్లేట్లకు ప్లేట్లు లాగించేస్తుంటారు. అంతేకాకుండా ఎక్కడికైనా వెళ్లినా తొందరగా అయిపోతుందని నూడుల్స్ చేసుకొని బాక్స్‌లో పెట్టుకుని మరీ వెళ్తుంటారు కొందరు.అయితే గత కొద్ది రోజుల నుంచి ఇన్‌స్టంట్ నూడుల్స్ ట్రెండ్ నడుస్తున్న సంగతి తెలిసిందే. వీటిని తయారు చేయడానికి ఎక్కువ సమయం పట్టదు కాబట్టి.. తమ వెంట క్యారీ చేస్తూ ఆకలేసి నప్పుడల్లా నూడుల్స్ తయారు చేసి తింటున్నారు. ఆఫీసుల్లో, బస్సుల్లో ఇన్‌స్టంట్ నూడుల్స్ రెండు నిమిషాల్లోనే రెడీ కావడంతో బాగున్నాయని లొట్టలేసుకుని లాగించేస్తున్నారు. అంతేకాకుండా సమయం సేవ్ అయిందని సంతోషపడుతున్నారు తప్ప తమ ఆరోగ్యానికి మేలు చేస్తాయా లేదా అనే ఆలోచన కూడా చేయడం లేదు. చిన్నారులు సతాయించినా సరే నూడుల్స్ చేసి పెడతానని తల్లులు చెబుతుంటారు.

దీంతో వారు సైలెంట్‌గా ఉండి చెప్పినట్లు వింటారు. అలాగే ఏడవకుండా ఆడుకుంటారు. అయితే ఇన్‌స్టంట్ నూడుల్స్ వల్ల ఆరోగ్యానికి హానీ కలుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇన్‌స్టంట్ నూడుల్స్ రుచికరంగా ఉండటానికి అధిక సోడియంను యాడ్ చేస్తారు. కాబట్టి వాటిని తినడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అంతేకాకుండా గుండె పోటు ప్రమాదం పెరిగి ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుంది. వీటిల్లో కేలరీలు ఎక్కువగా ఉండి ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, మినరల్స్ వంటి అవసరమైన పోషకాలు తక్కువగా ఉంటాయి. పోషకాల లోపానికి దారి తీసి పలు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. నూడుల్స్‌లో యాక్రిలామైడ్ అనే హానికరమైన రసాయనం ఉంటుందని ఇటీవల ఓ అధ్యయనంలో తేలింది. అయితే ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

ఇన్‌స్టంట్ నూడుల్స్‌లో ఫైబర్ అధికంగా ఉండి జీర్ణవ్యవస్థకు దెబ్బతీస్తుంది. దీంతో ఉబ్బరం, మలబద్ధకం, అతిసారానికి కారమై ఆరోగ్యాన్ని పాడు చేస్తాయి. ప్రస్తుతం అధిక బరువు సమస్యతో బాధ పడుతున్న వారి సంఖ్య రోజు రోజుకి పెరుగుతుంది తప్ప తగ్గడం లేదు. దానికి కారణం.. కూర్చుని జాబ్ లో చేస్తూ కష్టపడటానికి ఆసక్తి చూపించడం లేదు. అలాగే ఇన్‌స్టంట్ ఫుడ్స్, ప్యాకేజింగ్ ఆహారాలు తింటూ అలాగే కూర్చుంటున్నారు. దీంతో కేలరీలు పెరగడంతో.. అధిక బరువు బారిన పడుతున్నారు. తర్వాత తగ్గేందుకు చిట్కాలు పాటిస్తూ నానా తంటాలు పడుతున్నారు. అయితే నూడుల్స్ అధిక బరువు కారణమవుతాయి. కాబట్టి ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది.

# ఈ ఆకుకూర తింటే ఏ జబ్బురానే రాదు?

ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేసే ఆకుకూరలను చాలా మందే తింటారు. కానీ తోటకూరను చాలా తక్కువగా తింటారు. ఎందుకంటే ఇది కాస్త పసరు వాసన వస్తుందని కొందరు దీన్ని తినేందుకు ఇష్టపడరు. కానీ నిజానికి తోటకూర మనకు అందించే ఆరోగ్యకరమైన ప్రయోజనాలు, పోషకాలు అన్నీ ఇన్నీ కావు. ఈ క్రమంలోనే తోటకూర తినడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో ఇప్పుడు పూర్తిగా తెలుసుకుందాం.తోటకూరలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని ఎంతగానో మెరుగు పరుస్తుంది. దీంతో మలబద్దకం సమస్య ఈజీగా తగ్గుతుంది. అలాగే రక్తహీనత సమస్య ఉన్నవారికి తోటకూర వరమనే చెప్పవచ్చు. ఎందుకంటే ఈ తోటకూరలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల తోటకూరను తింటుంటే ఐరన్ పుష్కలంగా లభించి రక్తం అనేది అధికంగా తయారవుతుంది. దీంతో రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. ఇంకా అలాగే షుగర్ సమస్య ఉన్నవారు రోజూ 20 ఎంఎల్ మోతాదులో తోటకూర జ్యూస్‌ను తాగినా చాలు షుగర్ లెవల్స్ ఈజీగా తగ్గుతాయి. ఇంకా అలాగే తోటకూరలో ఉండే క్యాల్షియం ఎముకలు, దంతాలనుచాలా బలంగా మారుస్తుంది.తోటకూర



గుండె ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఎందుకంటే ఇందులో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది హైబీపీని ఈజీగా నియంత్రిస్తుంది. అందువల్ల గుండె సమస్యలు రాకుండా చూస్తుంది. పైగా తోటకూరలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. ముఖ్యంగా బీటాకెరోటిన్ ఇంకా విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఈజీగా రక్షిస్తాయి. ఒత్తిడి, వాపుల నుంచి కూడా రక్షిస్తాయి. ఇక అధిక బరువు తగ్గాలనుకుంటున్నవారు తోటకూరను తప్పనిసరిగా తీసుకోవాలి.

# గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలంటే...?



గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా కొన్ని ఆహార పదార్ధాలని తీసుకోవాలి.గర్భధారణ దశలో ఉన్న మహిళలు తమ ఆహారంలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని చేర్చుకోవాలి. ఇవి శరీరాన్ని తేమగా ఇంకా చల్లగా ఉంచడంలో సహాయపడతాయి. మండుతున్న వేడి కారణంగా అందరి పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. కాబట్టి ఈ సమయంలో, గర్భిణీ స్త్రీలు వేడి వాతావరణం కారణంగా మరింత అలసిపోయి చాలా బలహీనంగా ఉంటారు. కాబట్టి శక్తిని ఇంకా పోషణను అందించడమే కాకుండా శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడే ఆహారాలను తీసుకోవాలి.పండ్లలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి గర్భధారణ సమయంలో వివిధ రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవాలి. ముఖ్యంగా ఈ వేసవిలో, అయితే నీరు ఎక్కువగా ఉండే సీజనల్ పండ్లను మీ ఆహారంలో చేర్చుకోండి. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలంటే..గర్భిణీలు వేసవి లో తమ ఆహారంలో బెండకాయ, టమాటా, తిందా వంటి కూరగాయలను చేర్చుకోవాలి. ఈ కూరగాయలు చాలా తేలికగా జీర్ణమవుతాయి. ఇంకా నీరు కూడా సమృద్ధిగా ఉంటుంది. ఇవి కాకుండా దోసకాయ, ఉల్లిపాయ మొదలైన వాటిని సలాడ్‌గా తినండి.గర్భిణీ స్త్రీలు తమ ఆహారంలో పెరుగును చేర్చుకోవచ్చు.

# కన్నడ బ్లాక్ బస్టర్ లవ్ మాక్టైల్ 2.. తెలుగు రిలీజ్ డేట్ ఇదే..

కన్నడలో బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన లవ్ మాక్టైల్ 2 సినిమా.. ఇప్పుడు తెలుగు డబ్బింగ్ వర్షెన్‌లో రిలీజ్ కానుంది. ఈ సినిమాలో మిలిన నాగరాజ్, అమృత అయ్యంగర్, రచల్ డేవిడ్, నకుల్ అభయాన్కర్ ముఖ్య పాత్రలు పోషించారు. డార్లింగ్ కృష్ణ నిర్మాతగా, దర్శకుడిగా వ్యవహరించడమే కాక తనే హీరోగా నటించి మెప్పించాడు. ఇక ఈ సినిమాని కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ పతాకంపై ఎంవీఆర్ కృష్ణ ఈ నెల 14న మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాకు సంగీత దర్శకుడు నకుల్ అభయాన్కర్ మంచి మ్యూజిక్ అందించాడు.




# ధనుష్ 'రాయన్' రిలీజ్ డేట్ ఫిక్స్..



ధనుష్ స్వయం ధర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ 'రాయన్'. ఈ సినిమాలో టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ మరో లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కాళిదాస్ జయరామ్ మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. కాగా, ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్, సాంగ్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు మేకర్స్. వచ్చే నెల (జులై) 26న ఈ మూవీ థియేటర్స్ లో విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి తెలుగు వెర్షన్‌ను గ్రాండ్ గా విడుదల చేయనుంది. ఫస్ట్ క్లాస్ ప్రొడక్షన్ స్టాండర్డ్స్ తో రూపొందుతున్న ఈ సినిమాలో ఎస్.జె.సూర్య, సెల్వరాఘవన్, అపర్ణ బాలమురళి, దుషార విజయన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

## పవన్ కల్యాణ్‌కు...

# ఉస్తాద్ భగత్‌సింగ్ పోస్టర్ గిఫ్ట్

ఏపీలోని కేసరపల్లిలో ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కాగా, పవన్ నోటివెంట 'పవన్ కల్యాణ్ అనే నేను' మాట వినగానే సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. ఈ మాట కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జనసేన సైనికులు, సినీ అభిమానుల కోరిక ఈరోజు నెరవేరింది. కాగా, పవన్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ పవర్ స్టార్, హరీశ్ శంకర్ కాంబోలో తెరకెక్కతున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' మూవీ యూనిట్ అదిరిపోయే పోస్టర్‌ను విడుదల చేసింది.

పోలీస్ యూనిఫాం వేసుకొని చేతిలో సుత్తి పట్టుకుని ఉన్న పవన్ స్టిల్ సింప్లీ సూపర్‌గా ఉంది. ఇక ఈ పోస్టర్‌లో 'సనాతన ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అనే క్యాప్షన్ కనిపించింది. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది.





# 'పుష్ప 2' వాయిదా... కారణం అదేనా!

ప్రస్తుతం టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రాలలో పుష్ప ఒకటి. బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుంది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదల చేసిన టీజర్‌తో పాటు ఫస్ట్ సింగిల్ సూసేకి అగ్గి రవ్వ సాంగ్ సోషల్ మీడియాలో దూసుకుపోతున్నాయి. ఇక ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. తాజాగా ఈ మూవీ విడుదల తేదీ వాయిదా పడనున్నట్లు తెలుస్తుంది. ఈ మూవీ షూటింగ్ జూన్ ఎండింగ్ నాటికి ముగించాలని అల్లు అర్జున్ ఆర్డర్ వేసినట్లు సమాచారం. అయితే షూటింగ్ పూర్తి కావడానికి ఇంకో నెల సమయం పడుతుందని. ఇప్పటికే కొన్ని ఎపిసోడ్‌లను సుకుమార్ రీడిజైన్ చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఈ షూటింగ్ ఎఫెక్ట్ పడినట్లు సమాచారం. మరోవైపు వీఎఫ్ఎక్స్ వర్క్ విషయంలో సుకుమార్ కన్విన్స్ కాకపోవడంతో అవి పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# డెరివేటివ్స్‌లో స్థానం.. కంపెనీలకు ఇకపై కష్టమే

స్టాక్‌మార్కెట్లోని డెరివేటివ్స్ (ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్-ఎఫ్అండ్ఓ) విభాగంలో ట్రేడ్ అయ్యే కంపెనీల జాబితాలోకి కొత్త కంపెనీల ప్రవేశం ఇకపై కష్టంగా మారనుంది. దీనికి సంబంధించి నియమ నిబంధనలను కఠినతరం చేయాలని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రతిపాదించింది. అంతగా సత్తా లేని చిన్నా, చితకా కంపెనీలను డెరివేటివ్స్ జాబితా నుంచి తొలగించే అవకాశం ఇందువల్ల ఏర్పడనుంది. నగదు విభాగంలో ట్రేడింగ్ వాల్యూమ్ అధికంగా నమోదయ్యే కంపెనీలే ఎఫ్అండ్ఓ విభాగంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇస్తారు. 'మార్కెట్ హెచ్చుతగ్గులు, మోసపూరిత ఆలోచనలు ఉన్న వ్యక్తుల చర్యల వల్ల సాధారణ మదుపరులు డెరవేటివ్స్ విభాగంలో నష్టాల పాలయ్యే ప్రమాదం ఉంది. వారికి తగినంత రక్షణ కల్పించడం తప్పనిసరి' అని సెబీ ఈ సందర్భంగా వివరించింది. అత్యంత నాణ్యమైన కంపెనీల షేర్లను, వాటిలో నమోదయ్యే ట్రేడింగ్ పరిమాణం, ఇతర అంశాల ఆధారంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొంది. దీనికి తగ్గట్లుగా డెరివేటివ్స్ విభాగంలో మార్పులు తీసుకురానున్నట్లు స్పష్టం చేసింది. డెరివేటివ్స్ విభాగంలో స్థానం పొందేందుకు కంపెనీలకు అర్హత, సంబంధిత విధివిధానాలను 2018లో నిర్దేశించారు. ఆ తర్వాత వీటిని సమీక్షించలేదు. గత కొన్నేళ్లలో నగదు విభాగంలో, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో ట్రేడింగ్ వాల్యూమ్ గణనీయంగా పెరిగింది. సంస్థాగత మదుపరులకు తోడు, సాధారణ మదుపరులు సైతం ఎఫ్అండ్ఓలో అధికంగా ట్రేడ్ చేస్తున్నారు. తగిన అవగాహన లేకుండానే ట్రేడింగ్ చేసి నష్టపోతున్న మదుపరుల సంఖ్య భారీగా పెరిగినందునే, నిబంధనలను కట్టుదిట్టం చేయాలని సెబీ సంకల్పించింది. సెబీ ప్రతిపాదనల ప్రకారం, డెరివేటివ్స్ విభాగంలోకి ఏదైనా కంపెనీని చేర్చాలంటే, ట్రేడింగ్ జరిగే మొత్తం రోజుల్లో కనీసం 75% రోజుల పాటు సంబంధిత కంపెనీ షేర్లలో ట్రేడింగ్ నమోదు కావాలి.





# ఆకాశాన్నంటిన ఆలు, ఉల్లి, టమాటా ధరలు....



దేశంలో కూరగాయల ధరలు భారీగా పెరిగనట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. గత 15 రోజుల్లో ఉల్లి టోకు ధరలు 50 శాతం వరకు పెరిగాయి. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ డేటాను పరిశీలిస్తే.. గత ఏడాది కాలంలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు, టమోటాల ధరలు 81 శాతం వరకు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఈ మూడు కూరగాయల సగటు ధరల్లో విపరీతమైన పెరుగుదల ఉంది. గత ఏడాది కాలంలో బంగాళదుంపలు, ఉల్లిపాయలు, టొమాటోల ధరల్లో ఎంత పెరుగుదల కనిపించిందో గణాంకాల ద్వారా తెలుసుకుందాం. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం.. ఏప్రిల్ 30, 2023న బంగాళదుంప సగటు ధర కిలోకు రూ. 18.88. ఇది జూన్ 10, 2024 నాటికి కిలో రూ. 30.57కి చేరింది. అంటే బంగాళదుంప ధర కిలో రూ.11.69 పెరిగింది. అంటే గత ఏడాది కాలంలో బంగాళదుంపల ధరలు 62 శాతం పెరిగాయి. జూన్ నెలలో బంగాళదుంపల సగటు ధర కిలోగ్రాముకు ఒక రూపాయి పెరిగింది.గతేడాది నుంచి ఉల్లి ధరలు సామాన్యులను కంటతడి పెట్టిస్తున్నాయి. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం, ఏప్రిల్ 30, 2023న కిలో ఉల్లిపాయల సగటు ధర రూ. 20.41. జూన్ 10 నాటికి రూ.33.98కి పెరిగింది. అంటే గత ఏడాది కాలంలో ఉల్లి ధర 66 శాతం పెరిగింది అంటే కిలో రూ.13.57. జూన్ నెలలో ఉల్లి సగటు ధర కిలోకు రూ.1.86 పెరిగింది. కాగా దేశ రాజధాని ఢిల్లీలో ఉల్లి ధర రూ.12 పెరిగింది. బంగాళదుంపలు, ఉల్లిపాయలతో పోలిస్తే టమాటా ధర అత్యధికంగా పెరిగింది. వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం.. ఏప్రిల్ 30, 2023న టమోటా రిటైల్ ధర కిలోకు రూ. 20.55. జూన్ 10, 2024న, ఈ టమోటా ధర రూ. 37.11కి తగ్గింది. అంటే గత ఏడాది కాలంలో టమాటా ధర 81 శాతం అంటే కిలో రూ.16.56 పెరిగింది.

# 6 రోజుల్లో రూ.1100 కోట్లు...!



నారా చంద్రబాబు కుటుంబం ప్రమోట్ చేస్తున్న హెరిటేజ్ ఫుడ్స్.. కేవలం 6 ట్రేడింగ్ సెషన్స్ లోనే 70శాతం పైగా పెరిగి రిటైల్ ఇన్వెస్టర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఎన్నికల రిజల్ట్స్ ప్రకటన తర్వాత ఈ స్టాక్ ను పట్టుకునేందుకు ఇన్వెస్టర్లు ఎంతగానో ప్రయత్నించారు. దీంతో ఈ స్టాక్ అప్పటి నుంచి పైపైకి చూస్తోంది. మే 31న 404 రూపాయలుగా ఉన్న ఈ స్టాక్.. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి 695 రూపాయలకు పెరిగింది. ట్రేడింగ్ ప్రారంభమైన 20 నిమిషంలోనే ఈ స్టాక్ 727కు పెరిగింది. ఆ తర్వాత ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ కు దిగడంతో ఈ స్టాక్ చివరకు 5శాతం పైగా లాభంతో 695 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాప్ విషయానికి వస్తే 6వేల 450 కోట్లకు పెరిగింది. మరోవైపు ఈ కంపెనీలో వాటా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు, తొమ్మిదేళ్ల మనవడు దేవాన్ష్ సంపద కేవలం 6 రోజుల్లో కోటి70 లక్షల రూపాయలు పెరిగింది. ఈ కంపెనీలో దేవాన్ష్ కు 0.06 శాతం వాటా. 1992లో ప్రారంభమైన హెరిటేజ్ ఫుడ్స్ లో చంద్రబాబు కుటుంబానికి మొత్తం 35.7 శాతం వాటా ఉంది. చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి ఈ కంపెనీలో 24.37శాతం వాటా, నారా లోకేశ్ కు 10.82శాతం వాటా, నారా బ్రాహ్మణికి 0.46శాతం వాటా ఉంది.

# తగ్గిన హోమ్ లోన్ వడ్డీ రేటు...!




హోమ్ లోన్ తీసుకోవాలనుకునే వారికి గుడ్ న్యూస్. ప్రముఖ ప్రైవేటు బ్యాంకు అయిన హెచ్డీఎఫ్సీ ఈ హోమ్ లోన్లపై వడ్డీ రేట్లను తగ్గించింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) ఎంపీసీ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఆర్బీఐ రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. వరుసగా ఎనిమిదో సారి ఆర్బీఐ రెపో రేటును అదే విధంగా కొనసాగించింది. ఈ క్రమంలో హెచ్డీఎఫ్సీ తన వడ్డీ రేట్లను సవరించింది. ముఖ్యంగా గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది. దీనిని మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్- బేస్డ్ లెండింగ్ రేట్స్(ఎంసీఎల్ఆర్) అని పిలుస్తారు. ఈ మార్పులేంటి? దాని వల్ల వినియోగదారులపై ప్రభావం ఎలా ఉంటుంది? కొత్త వడ్డీ రేట్లు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయి? తెలుసుకుందాం రండి.. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ తన ఎంసీఎల్ఆర్ ను ప్రకటించింది. ఇది బ్యాంకు అధికారిక వెబ్ సైట్ ప్రకారం జూన్ ఏడో తేదీ నుంచి అమలులోకి వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా ఎనిమిదోసారి రెపో రేటును యథాతథంగా ఉంచాలని నిర్ణయించడంతో బ్యాంకు ఈ నిర్ణయం తీసుకుంది. 2 సంవత్సరాల పదవీకాలంపై ఎంసీఎల్ఆర్.. హెచ్ఐఎఫ్సీ బ్యాంక్ 2 సంవత్సరాల పదవీకాలంలో రుణ రేటును 5 బేసిస్ పాయింట్లు (బీపీఎస్) తగ్గించింది. దానిని 9.35 శాతం నుంచి 9.30 శాతానికి తగ్గించింది. ఫలితంగా, అదే కాలవ్యవధికి గృహ రుణ రేట్లు తగ్గుతాయి. అయితే ఇతర కాల వ్యవధిలపై ఎంసీఎల్ఆర్ ను బ్యాంక్ మార్చలేదు. యథావిధిగాక కొనసాగించింది. బ్యాంక్ బెంచ్ మార్క్ ఎంసీఎల్ఆర్ ఇప్పుడు 8.95 శాతం నుంచి 9.35 శాతం మధ్య ఉంది. ఇది వినియోగదారులను ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాన్ని గమనిస్తే.. ఈ ఎంసీఎల్ఆర్ రివిజన్ల ప్రభావం తక్షణమే ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఎంసీఎల్ఆర్-ఆధారిత గృహ రుణాల కోసం రీసెట్ వ్యవధి ఉంది.


ఆ తర్వాత రుణగ్రహీతల కోసం రేట్లు సవరణ చేసే అవకాశం ఉంది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్- బేస్డ్ లెండింగ్ రేట్స్ (ఎంసీఎల్ఆర్) అంటే బ్యాంక్ డబ్బును రుణంగా ఇవ్వగల కనీస వడ్డీ రేటు. ఇది బ్యాంక్ నిధుల ఖర్చు, నిర్వహణ ఖర్చులు, పదవీకాల ప్రీమియం వంటి అంశాల ఆధారంగా నిర్ణయించబడుతుంది. తక్కువ ఎంసీఎల్ఆర్ అంటే సాధారణంగా తక్కువ ఈఎంఐలు లేదా తక్కువ లోన్ కాల వ్యవధి.

# కార్ల రిటైల్ విక్రయాలు 1% తగ్గాయ్



సార్వత్రిక ఎన్నికలు, ఎండల ప్రభావంతో ప్రయాణికుల వాహనాల (పీవీ-కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు) రిటైల్ విక్రయాలు గత నెలలో 0.96% తగ్గినట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా సోమవారం వెల్లడించింది. దేశంలోని 1503 ఆర్‌టీఏ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఈ వివరాలను సంస్థ ప్రకటించింది. ప్రయాణికుల వాహన రిజిస్ట్రేషన్లు 2023 మే నెలలో 3,06,305 జరగ్గా, ఈ ఏడాది మే నెలలో 3,03,358కి పరిమితమయ్యాయి. 'ఎన్నికల సందర్భంగా నగదు లభ్యత సమస్య ఏర్పడింది. ముఖ్యంగా రూ.50,000కు మించి నగదు తీసుకెళ్లేప్పుడు ఆధారం చూపాలనడం ప్రభావం చూపింది. దీంతోపాటు ఎండలు అధికంగా ఉండటం, కొత్త మోడళ్ల లేమి, తయారీ సంస్థల ప్రచార కార్యక్రమాలు బలహీనంగా ఉండటం వంటివి విక్రయాలపై ప్రభావం చూపాయ'ని ఫాడా ప్రెసిడెంట్ మనీష్ రాజ్ సింఘానియా వెల్లడించారు. ఎండల వేడి తాళలేక విక్రయ కేంద్రాలకు వెళ్లడాన్ని వాయిదా వేసుకున్న వారు 18 శాతం ఉన్నారనే అంచనాను వ్యక్తం చేశారు. ఈ ఏప్రిల్‌లో 3,35,123 ప్రయాణికుల వాహనాలు విక్రయమయ్యాయి. అంటే నెలవారీగా చూసుకుంటే మాత్రం, గత నెలలో వీటి అమ్మకాలు 9.48% తగ్గాయి. మొత్తంమీద చూసుకున్నా, ప్రయాణికుల వాహనాలు, ట్రాక్టర్ల విక్రయాల్లోనే స్వల్ప ప్రతికూల వృద్ధి నమోదైంది. అన్ని విభాగాల వాహనాలను కలుపుకుంటే మాత్రం సానుకూల వృద్ధే ఉంది.

# నామినీ లేకున్నా పాత డీమ్యాట్ ఖాతా కొనసాగుతుంది




నామినీ పేరును సమర్పించని వారి డీమ్యాట్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్ ఫోలియోలను స్తంభింపచేయాలన్న నిబంధనను సడలిస్తూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయం తీసుకుంది. గతంలో జారీ చేసిన నిబంధనల మేరకు ఈ నెల 30 లోపు డీమ్యాట్ ఖాతాదారులు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడిదారులు నామినీ పేరును పేర్కొనడం లేదా, నామినీ అవసరం లేదు (ఆప్ట్ ఔట్ ఆఫ్ నామినేషన్).. ఇందులో ఏదో ఒకటి తెలియజేయాల్సి ఉంది. ఇలా పేర్కొనని ఖాతాలను నిలిపివేయాలని సెబీ గతంలో పేర్కొంది. ఈ నిబంధనను మరోసారి పరిశీలించాలని మార్కెట్ వర్గాల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న సెబీ తన పాత ఆదేశాన్ని సడలిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మదుపు చేస్తున్న డీమ్యాట్ ఖాతాదారులు, ఫండ్ మదుపరులు నామినేషన్ వివరాలు తెలియజేయకున్నా, వారి ఖాతాల విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవద్దని పేర్కొంటూ సోమవారం తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతోపాటు , భౌతిక రూపంలో షేర్ల సర్టిఫికెట్లు ఉన్న వారికీ డివిడెండ్, వడ్డీ, ఇతర చెల్లింపులతోపాటు, అవసరమైన సేవల విషయాలన్నీ నామినేషన్‌తో సంబంధం లేకుండా అందించాలని పేర్కొంది. ఇప్పటికే చెల్లింపులను నిలిపివేస్తే వాటిని చెల్లించాలని తెలిపింది. కొత్తవారు తప్పనిసరిగా..: కొత్తగా డీమ్యాట్ ఖాతా ప్రారంభించేవారు, ఫండ్లలో మదుపు చేసే వారు నామినీ పేరును వెల్లడించడం లేదా నామినేషన్ అవసరం లేదనే విషయాన్ని తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఖాతాలు, ఫండ్ పెట్టుబడులకు ఈ విషయంలో మినహాయింపు ఉంటుంది. అక్టోబరు 1 నుంచి సంస్థలు తమ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లలో నామినేషన్ పేర్కొనేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సెబీ పేర్కొంది.

# కొత్త ప్లాన్ వచ్చేసింది.. ఇకపై 35 రోజుల వ్యాలిడిటీతో ఆఫర్!

ఎయిర్‌టెల్ నుంచి మరో సరికొత్త ప్లాన్ వచ్చేసింది. మిగతా రంగాలకు ధీటుగా కొత్త ప్లాన్‌ను అమల్లోకి తెచ్చింది. కస్టమర్లను ఆకట్టుకోవడం కోసం ఎయిర్‌టెల్ సరికొత్త రీఛార్జ్ ప్లాన్స్‌ను తీసుకొచ్చింది. దీని వ్యాలిటిడీ ఏకంగా 35 రోజులు కావడం విశేషం. తన కస్టమర్లను ఆకట్టుకోవడం కోసం ఎయిర్‌టెల్ సరికొత్త రీఛార్జ్ ప్లాన్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తుంది. ఈ క్రమంలో తాజాగా ఎయిర్‌టెల్ 35 వ్యాలిడిటీ ఉన్న ప్లాన్‌ను తీసుకొచ్చింది. సాధారణంగా ఇప్పుడు రీఛార్జ్ ప్లాన్స్ వ్యాలిడిటీ ఏవైనా 28 రోజులు మాత్రమే ఉంటున్నాయి. కానీ ఎయిర్‌టెల్ దీనికి భిన్నంగా 35 రోజుల వ్యాలిడిటీతో సరికొత్త ప్లాన్‌ను తీసుకొచ్చింది. ఈ ప్లాన్ ద్వారా తక్కువ ధరతో.. ఎక్కువ వ్యాలిడిటీ ఉండే రీఛార్జ్ ప్లాన్స్‌ను పొందుకోవచ్చు. ఎయిర్‌టెల్ తీసుకొచ్చిన 35 రోజుల వ్యాలిడిటీ ప్లాన్ ధర రూ.289. దీనిలో కస్టమర్లు ఎస్ఎంఎస్, అన్‌లిమిటెడ్ కాలింగ్‌తో సహా అనేక ప్రయోజనాలను పొందుతారు. ఈ ప్లాన్ అపరిమిత వాయిస్ కాలింగ్, 300 ఎస్ఎంఎస్ సేవతో వస్తుంది. ఇందులో కస్టమర్లు 4 జీబీ డేటా ప్రయోజనం కూడా పొందుతారు. అంటే ఈ కొత్త రూ. 289 రీఛార్జ్ ప్లాన్ ఎక్కువ డేటాను ఉపయోగించాల్సిన అవసరం లేని వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

# కోర్టుకు నవనీత్ రాణా గైర్హాజరు



ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే నివాసం వెలుపల హనుమాన్ చాలీసా పఠించిన వివాదంపై 2022లో నమైదన కేసులో బుధవారం కోర్టులో హాజరుకావలసిన బిజెపి మాఈజ ఎంపి నవనీత్ రాణా అనారోగ్య కారణంపై గైర్హాజరయ్యారు. కాగా..ఆమె భర్త, అమ్రావతి ఎమ్మెల్యే రవి రాణా మాత్రం ఇదే కేసులో కోర్టు ఎదుట హాజరయ్యారు. అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే అధికారిక నివాసం బాంద్రాలోని మాతోశ్రీ ఎదుట హనుమాన్ చాలీసా పఠిస్తామని నవనీత్ రాణా ప్రకటించారు. ఆమెను అరెస్టు చేసేందుకు ముంబైలోని ఖేర్ ప్రాంతంలోని ఆమె నివాసం వద్దకు వెళ్లిన పోలీసు అధికారులతో ఆమె వాగ్వాదానికి దిగడమేకాక పోలీసులు తమ విధులను నిర్వర్తించకుండా అడ్డుపడినందుకు ఆమెపై ఐఇపిసిలోని 353 సెక్షన్ కింద కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ ఆమె నవనీత్ రాణా దంపతులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్ను కోర్టు 2023 డిసెంబర్లో తిరిస్కరించింది. జనవరి నుంచి ఈ కేసు విచారణ పలు దఫాలు వాయిదా పడుతోంది. నిందితులు కోర్టుకు హాజరుకాకపోవడంతో విచారణ ప్రక్రియ ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. గత విచారణ సందర్భంగా రాణా దంపతులు జూన్ 12న కచ్చితంగా హాజరు కావాలని ఎంపి, ఎమ్మెల్యే కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఆర్ఎన్ రోకడే ఆదేశించారు. అయితే బుధవారం నవనీత్ రాణా గైర్హాజరు కాగా ఆమె భర్త రవి రాణా మాత్రం కోర్టు ఎదుట హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను జులై 2వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు.

# పవన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అకీరా, ఆద్య..







విజయవాడ: ఏపీ మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన కుమారుడు అకీరా, కూతురు ఆద్య సందడి చేశారు. మెగా ఫ్యామిలీ అంతా ఓ ప్రత్యేక బస్సులో ఈ కారక్యక్రమానికి హాజరయ్యారు. అకీరా పంచె కట్టులో అందరినీ ఆకర్షించాడు. పవన్ ప్రమాణం చేసిన సందర్భంగా సోషల్ మీడియా ద్వారా ఆయన మాజీ భార్య రేణూ దేశాయ్ శుభాకాంక్షలు చెప్పారు. 'వాళ్ల నాన్న బిగ్గెస్ట్ డేకు రెడీ అయ్యారు. ఏపీకి మంచి చేయాలనుకొనే కల్యాణ్ గారికి శుభాకాంక్షలు' అంటూ పోస్ట్ పెట్టారు. ఇన్‌స్టాలో అకీరా, ఆద్య ఫొటోలను పంచుకున్న రేణూదేశాయ్.. తనకు వీడియో కాల్ చేసినట్లు రేణూ దేశాయ్ చెప్పారు.

## తమిళిసైకి అమిత్ షా స్ట్రాంగ్ వార్నింగ్..?

# ఆ వీడియోనే సాక్ష్యం..!!



తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ తమిళిసై సౌందర్ రాజన్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఈ వీడియోపై తమిళిసై ఇప్పటి వరకు స్పందించలేదు. చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి వెంకయ్య నాయుడు, అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అయితే తమిళిసై కూడా హాజరయ్యారు. ఇక వేదికపై ఉన్న వారందరికీ అభివాదం చేస్తూ వెంకయ్య వద్దకు వచ్చారు తమిళిసై. వెంకయ్య నాయుడు, అమిత్ షాకు అభివాదం చేస్తూ తమిళిసై ముందుకు సాగారు. కానీ అమిత్ షా వెనక్కి రప్పించారు ఆమెను. ఆ తర్వాత సున్నితంగా ఆమెకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు ఆ వీడియో ద్వారా స్పష్టం మవుతోంది. ఎందుకంటే తమిళనాడు బీజేపీలో గ్రూపు రాజకీయాలు కొనసాగుతోన్న విషయం తెలిసిందే. తమిళనాడులో ఒక్కటంటే ఒక్క ఎంపీ సీటు కూడా బీజేపీ గెలవలేదు. దీంతో బీజేపీ చీఫ్ అన్నామలై, మాజీ చీఫ్ తమిళిసై సౌందర్ రాజన్ మధ్య వర్గపోరు తారాస్థాయిలో నడుస్తోంది. ఈ వర్గపోరుపై దృష్టి సారించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. తమిళిసైకి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. సంఘ విద్రోహశక్తులు బీజేపీలోకి ప్రవేశించిన తర్వాతనే తమిళనాడులో బీజేపీ ప్రాబల్యం తగ్గి ఓటమికి కారణమైందని తమిళిసై ఇటీవలే విరుచుకుపడ్డారు. అయితే అన్నామలైని ఉద్దేశించి ఆమె వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. బీజేపీ పరాజయానికి అన్నామలైనే కారణమని తమిళిసై మద్దతుదారులు ఆరోపించారు. తన అధ్యక్షతన ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓట్ల శాతం పెరిగిందని అన్నామలై పేర్కొన్నారు. మొత్తానికి ఇరువురి మధ్య సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి.

# ఢిల్లీలోని 15 మ్యూజియంలకు బాంబు బెదిరింపులు




దేశంలో బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. పలు విమానాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, కార్యాలయాలు, రాజకీయ నేతలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీలోని సుమారు 15 మ్యూజియంలకు ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. రాజధాని ప్రాంతంలోని రైల్వే మ్యూజియం సహా మొత్తం 10 నుంచి 15 మ్యూజియంలకు కొందరు వ్యక్తులు మంగళవారం బాంబు బెదిరింపు మెయిల్స్ పంపారు.

దీంతో వెంటనే అప్రమత్తమైన ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి ఆయా మ్యూజియంల వద్ద తనిఖీలు చేపట్టారు.

# కువైట్‌లో ఘోర అగ్ని ప్రమాదం.. 35 మంది సజీవదహనం..మృతుల్లో భారతీయులు



కువైట్‌లో ఘోర ప్రమాదం జరిగింది. దక్షిణ మంగాఫ్ జిల్లాలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో దాదాపు 35 మంది మృతి చెందినట్లు ప్రభుత్వ ఆధ్వర్యంలోని కువైట్ న్యూస్ ఏజెన్సీ (కునా) వెల్లడించింది. బుధవారం తెల్లవారుజామున కార్మికులు నివాసం ఉంటున్న భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద ఎత్తున వ్యాపించాయి. భవనంలో మంటలు వేగంగా వ్యాపించడంతో చాలా మంది లోపల చిక్కుకున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురు కేరళీయులు మరణించినట్లు నివేదికలు వెల్లడించాయి. "దట్టమైన పొగతో ఊపిరాడక చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 40మందికి పైగా స్పృహ తప్పి పడిపోయారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అందుపు చేశారు. భవనంలో చిక్కుకున్న వారిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడినవారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు" అని సీనియర్ పోలీసు కమాండర్ తెలిపారు. అగ్నిప్రమాదం కారణంగా 43 మంది ఆసుపత్రి పాలయ్యారని, వారిలో నలుగురు మరణించారని కువైట్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పోలీసులు చెప్పిన 35 మరణాలకు అదనంగా నలుగురి మరణాలు ఉన్నాయా? అనేది స్పష్టంగా తెలియలేదు. మంటలను అదుపు చేశామని, ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన అఖిలేష్ యాదవ్




సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో తన రాజీనామా లేఖను అసెంబ్లీ కార్యాలయంలో సమర్పించారు. అఖిలేష్ తోపాటు అవధేష్ ప్రసాద్ కూడా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. కర్హల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలిచిన అఖిలేష్.. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించారు. దీంతో ఆయన ఎంపీగా కొనసాగాలని నిర్ణయించుకుని.. అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. అవధేష్ ప్రసాద్ కూడా.. ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. లోక్ సభ ఎన్నికల ఫలితాల్లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ ఇండియా కూటమి.. ఉత్తరప్రదేశ్‌లోని 80 సీట్లలో 43 స్థానాలను గెలుచుకుని లోక్‌సభలో మూడవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 6 సీట్లు గెలుచుకుంది. ఎస్పీ 62, కాంగ్రెస్ 17 స్థానాల్లో పోటీ చేశాయి.

## కర్నాటకకు టెస్లా కంపెనీ.. కేంద్ర మంత్రి ఏమన్నారంటే?



న్యూఢిల్లీ: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రిగా హెచ్‌డీ కుమారస్వామి బాధ్యతలు చేపట్టారు. తానేమీ స్వార్థపరుడిని కాదు అని, కేవలం స్వంత రాష్ట్రం కోసం కాకుండా, యావత్ దేశం కోసం పనిచేయనున్నట్లు చెప్పారు. మంగళవారం మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన్ను ఓ రిపోర్టర్ ప్రశ్న వేశారు. కర్నాటకలో టెస్లా లాంటి కంపెనీలు ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయా అని అడిగారు. దానికి మంత్రి కుమారస్వామి స్పందించారు. అవును, ఆ ఆలోచన ఉందని, ఆ కంపెనీతో చర్చిస్తామని మంత్రి కుమారస్వామి అన్నారు. కర్నాటక వరకు తాను ఆలోచించడం లేదని, తన ఫోకస్ దేశం మొత్తం ఉందని, దాని ప్రకారమే పనిచేస్తామని, నేనేమీ స్వార్థపరుడిని కాదు అని, దేశ వృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తామని మంత్రి వెల్లడించారు. టెస్లా కంపెనీ ఇండియాలో తన ప్లాంట్‌ను స్టార్ట్ చేస్తుందా లేదా అన్న డౌట్స్ చాన్నాళ్ల నుంచి ఉన్నాయి. గత ఏడాది ప్రధాని మోదీ.. అమెరికాలో టెస్లా కంపెనీకి వెళ్లి అక్కడ మస్క్‌ను కలిసిన విషయం తెలిసిందే. ఇండియాలో త్వరలోనే టెస్లాను ప్రారంభిస్తామన్న నమ్మకాన్ని కూడా మస్క్ అన్నారు. మార్చి నెలలో భారత సర్కారు కొత్త ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని ప్రకటించింది. దానికి ప్రకారం పన్నులను తగ్గించనున్నారు. టెస్లా లాంటి కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ప్రయత్నాలు చేస్తున్నారు.

# రూ.300 కోట్ల ఆస్తి కోసం.. కోటి ఖర్చు చేసి మామను చంపించిన మహిళ



ముంబై: సుమారు రూ.300 కోట్ల ఆస్తిని దక్కించుకునేందుకు ఒక మహిళ కుట్ర పన్నింది. కోటి ఖర్చు చేసి మామను చంపించింది. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం తెలిసింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ సంఘటన జరిగింది. మే నెలలో 82 ఏళ్ల పురుషోత్తం పుట్టేవార్ భార్యకు సర్జరీ జరిగింది. కోలుకుంటున్న ఆమెను చూసేందుకు పురుషోత్తం ఆసుప్రతికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తుండగా ఒక కారు వేగంగా ఆ వృద్ధుడ్ని ఢీకొట్టి మీద నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ వృద్ధుడు మరణించాడు. కాగా, ఈ రోడ్డు ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు జరిపారు. వృద్ధుడు పురుషోత్తంను ఢీకొట్టిన కారు డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. ఆ నిందితుడు వృద్ధుడి కుమారుడి కారు డ్రైవర్‌గా పోలీసులు తెలుసుకున్నారు. అతడ్ని ప్రశ్నించగా వృద్ధుడి కోడలైన 53 ఏళ్ల అర్చనా మనీష్ పుట్టేవార్ ఆస్తి కోసం మామను హత్య చేయించినట్లు వెలుగులోకి వచ్చింది. దీని కోసం ఆమె కోటి ఖర్చు చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. మరోవైపు డాక్టరైన భర్త మనీష్ కారు డ్రైవర్ బాగ్డే, నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్‌లతో కలిసి మామ పరుషోత్తం హత్యకు కోడలు అర్చన కుట్రపన్నినట్లు దర్యాప్తులో తేలింది. రోడ్డు ప్రమాదంలో మామ మరణించినట్లుగా నమ్మించేందుకు సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయించింది. మామను చంపేందుకు నిందితులకు ఆమె కోటి చెల్లించినట్లు పోలీసులు తెలుసుకున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన అర్చనతోపాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. రెండు కార్లు, బంగారు నగలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## రాష్ట్రంలో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం : వాతావరణ కేంద్రం

హైదరాబాద్ : ఇవాళ తెలంగాణ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రేపు, ఎల్లుండి కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఇవాళ మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com